# యువత పారిశ్రామిక వేత్తలుగా రాణించాలి

-పోటీ ప్రపంచాన్ని ధీటుగా ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి -జేఎన్టీయూ వీసీ సుదర్శన్ రావు



తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: నూతన ఆవిష్కరణలపై యువత దృష్టి సారించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జేఎన్టీయూ వీసీ సుదర్శన్ రావు పిలుపు నిచ్చారు. స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో తరంగ్ 2025 పేరుతో గురువారం జరిగిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొని ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్‌నూ, ఆధునిక సాంకేతక పరిజ్ఞానంలోనూ పట్టు సాధించాలన్నారు. అడ్మిషన్ పొందిన తొలి రోజు నుంచే విద్యార్థి లక్ష్యాని ఎంపిక చేసుకుని కోర్సు పూర్తైన వెంటనే ఉద్యోగంలో స్థిరపడాలని సూచించారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఉపయుక్తమైన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారిస్తే చిరస్థాయి గుర్తింపుతో పాటు పదిమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే స్థాయికి చేరుకుంటారని తెలిపారు. విద్యార్థి దశ కీలకమని, ప్రతినిత్యం తల్లిదండ్రుల శ్రమ విద్యార్థికి గుర్తుకురావాలని సూచించారు. కళాశాల విద్యార్థుల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుందన్నారు. సెల్ఫోన్లు, సినిమాలు, చెడు వ్యసనాలు జీవితం కాదని విద్యార్థులు ఉన్నత ఆశయం వైపు అడుగులు వేయాలని సూచించారు. వార్షికోత్సవం సందర్భంగా అకడమిక్ విద్యలోనూ, క్రీడలలోనూ ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులు జ్ఞాపికలు, ధృవపత్రాలను అందజేశారు. అనంతరం విద్యార్థుల ఫ్లాష్ మాబ్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యాసంస్థల డైరెక్టర్ మన్నెం వెంకటరామిరెడ్డి, కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర, కన్వీనర్ మునిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# రూ.12 కోట్లు...
# వసతి గృహాలను పట్టించుకోరా!

-కైలాస్ సదన్ వసతి గృహాలు, రూ.12కోట్లు వ్యయంతో నిర్మాణం
-6నెలలకే లీకేజీలతో 6గదులు మూసివేత -ఇఓ, డిప్యూటీ ఇఓతో సహా ఇంజనీరింగ్‌శాఖకు తెలియని వైనం -ఆలయలో తిష్టవేసి, పరిసరాలను పట్టించుకోని అధికారులు-భక్తుల సదుపాయాలకు పెద్దపీట అంటూ ప్రకటనలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో అతిథి గృహాల పర్యవేక్షణ అగమ్యగోచరంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో భక్తుల సౌకర్యార్థం అభ్యర్థించగా టిటిడి రూ.12కోట్ల ఆర్థిక సహకారంతో కైలాస్‌సదన్ నిర్మించారు. మూడు బ్లాకుల్లో బ్లాక్ నెంబర్ 3 సెల్లార్లో 6 గదులు నిర్మించారు. ఆరు నెలలుగా లీకేజి సమస్యలతో వీటిని మూసి పెట్టారు. పై అంతస్థు నుండి, క్రింది సెల్లారుకు వరకు బాత్‌రూమ్ పైపుల ద్వారా నీటి లీకేజీలు వస్తున్నట్లు సమాచారం. ఇక్కడ ఇన్‌చార్జిని అడిగితే మాకు సంబంధం లేదు, పై అధికారులు చూసుకోవాలి అనే విధంగా సమాధానం. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇఇకే తెలియదంటే పర్యవేక్షణ ఎలా ఉందో అర్థమౌతుంది. అసలు లీకేజి ఎక్కడ నుంచి వస్తుందనేది ఇప్పటి వరకు ఇంజనీరింగ్‌శాఖ పర్యవేక్షించక పోవటం గమనించదగ్గ విషయం. ఇఓ, డిప్యూటీ ఇఓతో సహా అందరూ అధికారులు ఆలయానికి పరిమిత వైనం. ఆలయ పరిసరాలపై పర్యవేక్షణ కొరవడడంతో సమస్యలు గుర్తించకపోతున్నారు.



కైలాససదన్ వసతి గృహం, ఉరుస్తున్న కారణంగా గదులకు తాళం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన కేవలం రాహుకేతుదోష నివారణ పూజలకే పరిమితమౌతుంది. ముఖ్యంగా కోట్లు వెచ్చించి కైలాసగిరి పర్వత పంక్తుల్లోని భరద్వాజ తీర్థంలో రాబోవు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చక్కటి అతిథి గృహాలను నిర్మించారు. కొన్ని టిటిడి సౌజన్యంతో నిర్మించగా మరి కొన్ని శ్రీకాళహస్తీశ్వరుని నిధులతో నిర్మించారు. ఇక్కడ టిటిడి అతిథి గృహాలు కాకుండా దేవస్థానం 125 గదులను నిర్మించింది. వీటిని 2022 అక్టోబర్ 5న వైకాపా పాలనలో దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. ఇక్కడ కోట్లు వెచ్చించి భవనాలు నిర్మించి, అక్కడకు చక్కటి రోడ్లు వేసారు. కార్పొరేట్ పట్టణాలను మరిపించే విధంగా దేదీప్యమానంగా దీపాలు ఏర్పాటు చేసారు. కానీ అక్కడ గదులున్నట్లు ప్రచారం చేయటంలో దేవస్థానం వైఫల్యం స్పష్టం అవుతుంది. సుమారు 30 నెలల్లోనే ఇక్కడ పరిపాలన, గదుల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. గదుల్లో సెల్‌ఫోన్లు, గీజర్లు పని చేయవు, కానీ పట్టించుకునే దిక్కులేదు. కనీసం సచారం ఇచ్చే చొరవ కూడా చేయటం లేదు. ఇక్కడ కనీస సదుపాయాల్లేనందువల్ల అవకాశం ఉన్నా భక్తులు వెళ్ళటం లేదు. చక్కటి వాతావరణం, ఆహ్లాదకర పార్కులు స్వచ్ఛమైన గాలి వచ్చే చోట నిర్మించిన అతిథి గృహాలకు సంబంధించి వచ్చిన యాత్రికులకు వివరించే దిక్కేలేదు.

**లీకేజీఎ క్కడ నుంచి వస్తుంది?**

కైలాస సదన్‌లోని బ్లాక్ నెంబర్ 3లోని సెల్లార్లో 1 నుంచి 6 గదులు ఆర్నెల్లుగా లీకేజీ సమస్యతో ఇబ్బంది పడుతూ మూసి వేసారు. ఈ విషయం ఇంజనీరింగ్ శాఖకు తెలియదు. ఇక్కడ సమస్యకు సంబంధించి అక్కడ పని చేసే సిబ్బందిని అడిగితే మూసివేసిన గదులు గురించి తెలియదని చెబుతారు. మరి ఇంజనీరింగ్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వలేదు.

**వారం లోపల బాగు చేస్తాం : ఇఇ**

కైలాస సదన్‌లోని బ్లాక్ నెంబర్ 3సెల్లార్లో ఆరుగదులు లీకేజిలకు సంబంధించి ఇఇ మురళీధర్‌రెడ్డిని వివరణకోరగా ఈ సమస్య తన దృష్టికి రాలేదని వివరణ ఇచ్చారు. వారం రోజుల్లో లీకేజీలను అరెస్టు చేస్తామన్నారు.

# 2026లో పంచాయితీరాజ్, మున్సిపల్ ఎన్నికలు

- ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం -ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్

తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :2026లో పంచాయితీ రాజ్, మున్సిపల్ ఎన్నికలు జరగనున్నా యని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ఇప్పటికే అన్ని సర్వం సిద్ధం చేసినట్లు ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రానున్న సంవత్సరంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు, పంచాయితీ రాజ్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై అధికారులకు సూచనలు చేస్తూ, అలాగే అధికారుల సలహాలు, సూచనలను కోరుతూ ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని (రిటైర్డ్), తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని (రిటైర్డ్)తో కలసి మేథో మథన కార్యక్రమంలో పాల్గొనగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్ఓ నరసింహులు, పంచాయితీ రాజ్ శాఖ మున్సిపల్ శాఖ, పోలీస్ శాఖ, రెవెన్యూ తదితర సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ సీఈసీ కమిషనర్ నీలం సాహ్ని మాట్లాడుతూ రానున్న పంచాయితీ రాజ్, మునిసిపల్ ఎన్నికల నిర్వహణకు ఈవీఎంల వినియోగంపై పరిశీలిస్తున్నామని, వాటి సాధ్యాసాధ్యలపై అధికారుల సూచనలు, సలహాలను ఆహ్వానిస్తూ చర్చించారు. అంతే కాకుండా మాస్టర్ ట్రైనర్ శిక్షణ, భద్రత బలగాలు, మానవ వనరులు, బడ్జెట్ తదితర అంశాలపై ముందస్తు అంచనాలతో ప్రణాళికలు సిద్ధం కావాలసి ఉంటుందని ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని (రిటైర్డ్) తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని (రిటైర్డ్) మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధత పై ఏపీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వారి సూచనలు ఎంతో విలువైనవి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, జిల్లా పంచాయితీ అధికారిని సుశీలా దేవి, డెప్యూటీ కమిషనర్ తిరుపతి మున్సిపాలిటీ అమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అవిశ్వాస తీర్మానానికి టిడిపికి సంబంధం లేదు



వెంకటగిరి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే విషయంలో తెలుగుదేశంపార్టీ వారికి సంబంధం లేదని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు తెలిపారు. వెంకటగిరిలోని ఎమ్మెల్యే నివాస గృహంలో తెలుగుదేశం పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసిపి సమన్వయకర్త రామ్‌కుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ వారు చైర్పర్సన్‌ను అవిశ్వాస తీర్మానం పెట్టి ప్రయత్నాలు ఆపివేసినట్లు చేసిన ఆరోపణలు అవాస్తమ న్నారు. మున్సిపాలిటీలో మొత్తం వైసిపి వారి మధ్యనే పోరు నడిచిందని తెలిపారు. చైర్‌పర్సన్ వైసీపీ కార్యక్రమాలకి హాజరు కావడం లేదని పదవి నుండి దింపి ఆమెను ఇబ్బంది పెట్టి తన వైపు తిప్పు కునేందుకు పెట్టించారని విమర్శించారు. ఎమ్మెల్యే అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని వాయిదా వేయించాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చేసిన ఆరోపణలు ఆవాస్తమన్నారు. ఆల్తురుపాడు రిజర్వాయర్ పనుల విషయమై చర్చించేందుకు ఎమ్మెల్యే కలెక్టర్ కలిశారని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి అవిశ్వాస తీర్మానానికి సంబంధం లేదని ఖండించారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ విశ్వనాథ, నాయకులు సత్య నారాయణ, నరసింహులుజనసేన పార్టీ నాయకులు జంపాల ప్రకాష్ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు!

-పట్టించుకోని రెవెన్యూ-మైనింగ్ అధికారులు



నాయుడుపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : నాయుడుపేటలో కొంతమంది అక్రమార్కులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం బరితెగించి విచ్చలవిడిగా ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నా...సంబంధిత రెవెన్యూ-మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో మండలంలోని అరవపెరిమిడి చెరువు పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల నుండి రాత్రి సమయంలో భారీ యంత్రాలతో గ్రావెల్ తరలిస్తూ లక్షల రూపాయలు దొచుకుం టున్నారు. నాయుడుపేటలో ప్లాట్లుసదును చేయుటకు గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉండటంతో అక్రమార్కుల వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది. ఈవిధంగా ప్రభుత్వ భూము ల్లో పెద్దపెద్ద గోతులు తీయ్యడం వల్లన వర్షాకాలంలో ఆగుంటల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈవిషయమై గూడూరు మైనింగ్ ఎడిని వివరణ కోరగా, ఆయన మాట్లడుతూ మండలంలోని అరవపెరిమిడి గ్రామంలో మైనింగ్‌కు సంబంధించి ఎవరికి ఏలాంటి అనుమతులు ఇవ్వలేదని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## బిసీ కార్పొరేషన్ ద్వారా...
## రూ.11.66 కోట్ల ఆస్తులు పంపిణీ

- నేడు మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలు

చిత్తూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలను శుక్రవారం రాష్ట్ర స్థాయి వేడుకగా నిర్వహించనున్నదని ఈ మేరకు జిల్లా కేంద్రం చిత్తూరులో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మహాత్మా జ్యోతిబా పూలే భవన్‌లో జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, బీసీ కార్పొరేషన్ పరిధిలో అర్హులైన బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీ వర్గాలకు చెందిన 500 మంది లబ్ధిదారులకు 11,66,30,000 రూపాయల విలువైన ఆస్తులను పంపిణీ చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, బీసీ కుల సంఘాల నాయకులు, అధికారులు, అనధికారులు పాల్గొని ఈ కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు.

## గాలి వాన భీభత్సం, విరిగిన చెట్లు ..
## కూలిన విద్యుత్ స్థంభాలు



చంద్రగిరి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: గాలి వాన భీభత్సానికి చింతచెట్టు వేర్లతో సహా పెళపెళ శబ్దాలతో విరిగిపడగా, ఈ ధాటికి రెండు విద్యుత్ స్థంభాలు నేలకూలాయి. చంద్రగిరిలో గురువారం మధ్యాహ్నం వరకు భగభగలాడిన భానుడి ప్రతాపాన్ని చల్లబరుస్తూ ప్రారంభమైన చినుకులు ప్రకృతిపై తన ప్రకోపాన్ని ప్రదర్శించింది. గాలి వాన ఉరుములు మెరుపులతో ప్రజలను సైతం బెంబేలెత్తించింది. కొత్తపేట, అంకాలమ్మ ఆలయానికి చేరువలో చెట్టు కూలడంతో రెండు వైపులా ట్రాఫిక్ స్థంభించింది. రెండు పోల్స్ కూలిపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు ఏడిఈ శేషాద్రి రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరాను నిలిపివేసిన ఏఈ నాగరాజ హుటాహుటిన తన సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. సిఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ అనిత తమ సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

# రాత్రి 11...దాటితే
# రోడ్లపై పోకిరీలకు లాఠీరుచి !

-నేరాలనియంత్రణ,రౌడీయిజం కట్టడికి పోలీసులు గస్తీ ముమ్మరం





ప్రభాతవార్త-తిరుపతి: పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో పూర్తిస్థాయి ప్రశాంతవాతావరణం నెలకొల్పి...రౌఢీయిజాన్ని అణచివేయడానికి, శాంతిభద్రతలు కట్టుదిట్టడం చేయడానికి తిరుపతి పోలీసులు లాఠీ ఝులిపిస్తున్నారు. రాత్రి 11గంటలు దాటితే నగరంలోని అనేక ప్రాంతాల్లో ,ఖాళీస్థలాల్లో ,వాహనాలపై తిష్టవేసిన పోకిరీరాయుళ్ళు, రౌడీమూకల ఆగడాలను ఎక్కడికక్కడ పసిగట్టి ఆ ప్రాంతంలో క్షణాల్లో వాలిపోయి పూర్తిగా పరిస్థితిని కంట్రోల్ చేసేరీతిలో పోలీసింగ్ మారింది. ఇప్పటికే దేశంలోని ఇతరరాష్ట్రాలతో పోల్చితే తిరుపతినగరం ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. యాత్రాస్థలం, పుణ్యక్షేత్రం కావడంతో 24గంటలూ యాత్రికులు, భక్తులు, వివిధ పనులపై తిరుపతికి వచ్చి వెళ్ళేవారు ఉంటున్నారు. ఇలా రోజుకు 50వేలమంది వరకు వచ్చి వెళుతున్న యాత్రికులుకావున ఇక్కడ పెద్దగా రోడ్లపై సమయం సందర్భం లేకుండా జులాయిగా తిరుగుతున్న పోకిరీలు, రౌడీమూకలను పోలీసులు కూడా పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పటికే తిరుపతి నగరం ప్రశాంతవాతావరణం నెలకొన్నా చాలావరకు కాలనీల్లో చాపక్రిందనీరులా రాత్రి 8-9గంటలు దాటితే రౌడీమూకలు ఆగడాలు పెచ్చుమీరిపోతున్నాయి. వీటిపై తిరుపతి వాసుల నుండి పోలీసు కంట్రోల్ రూమ్, పోలీసు అధికారులకు అందుతున్న ఫిర్యాదులతో తిరుపతిలో మద్యం సేవించి మత్తులో ఆగడాలు, రోడ్లపై వీరంగం సృష్టించి ఆ ప్రాంతాల్లో భయభ్రాంతులు చేయడం వంటి వాటికి పాల్పడుతున్నారు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు అందినా కొంతవరకు వెనుకంజవేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రౌడీయిజం పై పోలీసు జిల్లా ఎస్పీలకు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఎవరైనా హద్దుమీరి వ్యవహరించినా, ఆగడాలు చేసినా, మద్యం,గంజాయి మత్తులో వీరంగం చేసినా వదలిపెట్టొద్దని కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. దీంతో తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తనక్రింది స్థాయి పోలీసు అధికారులకు రాత్రి వేళ గస్తీపై మరింత స్పష్టమైన ఆదేశాలిచ్చారు. రాత్రిల్లో మొబైల్ వాహనాల్లో, రక్షక్ వాహనాల్లో అన్ని చోట్లా గస్తీ తిరగాలని, ప్రధాన కూడళ్లలో, గొడవలు, ప్రతీకార దాడులు జరిగే ప్రాంతాల్లో పటిష్టంగా పోలీసు గస్తీ ఉండాలని వాకీటాకీల్లో సూచించారు. తిరుపతి నగరంలో, శివార్లలో ఇకపై రాత్రి 11గంటలు దాటితే అల్లరిమూకలు. గుంపుగా గుమికూడి రౌడీయిజం చేసినా, అకారణంగా రోడ్లపై ద్విచక్రవాహనాల్లో , కార్లలో తిరుగుతున్నా అలాంటి వారికి పోలీసులు దేహశుద్దిచేస్తున్నారు. రెండురోజులుగా తిరుపతిలోని టౌన్‌క్లబ్ కూడలి, ఐఎస్ మహల్, రామకృష్ణడీలక్స్, భవానీనగర్ జంక్షన్, కొర్లగుంట, లీలామహల్ జంక్షన్, లక్ష్మీపురంజంక్షన్, ఆర్‌సిరోడ్డు, గ్రూప్‌థియేటర్స్ ప్రాంతం,, గాంధీరోడ్డు, రెడ్డిరెడ్డికాలనీలు, తుడ కార్యాలయం జంక్షన్, మున్సిపల్ మార్కెట్ ప్రాంతం, డిబిఆర్ ఆస్పత్రి మార్గంలో రౌడీమూకలు, యువత వాహనాల్లో తిష్టవేసి గొడవలకు పాల్పడటంవంటివాటికి పోలీసులు లాఠీ ఝులిపిస్తున్నారు. రెండురోజుల పోలీసుల గస్తీతో నగరజనం అభినందనలు వెల్లువెత్తాయి. తిరుపతిలో రౌడీయిజం నిర్మూలన, పోకిరీలు,అల్లరిమూకల ఆగడాలు నియంత్రణ ధ్యేయంగా సిఐలు, ఎస్ఐలు, పోలీసు టీమ్‌లు గస్తీ ముమ్మరం చేయడం తిరుపతి ప్రశాంతతకు మరో తార్కాణంగా చెబుతున్నారు.

## ప్రతి ఓవర్‌హెడ్ ట్యాంకు...
## 15 రోజులకు ఒకసారి శుభ్రం

- మంచినీటి పైపులు లీకేజీ లేకుండా చర్యలు- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



ఆర్‌డబ్ల్యుఎస్ డిఇలు, ఎఇలతో మంచినీటి సమస్యపై సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: వేసవికాలంలో ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా స్వచ్ఛమైన మంచినీటి సరఫరా చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశహాలులో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ గ్రామీణ మంచినీటి సరఫరా ఎస్ఇ విజయకుమార్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావులతో కలిసి వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన మందస్తు చర్యలపై గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ డిడిలు, ఎఇలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి క్లీనింగ్ చేయాలన్నారు. క్లీనింగ్ చేసే సమయంలో ఫోటోలు తీసి కలెక్టర్‌కు పంపాలన్నారు. అలాగే మంచినీటి పైపులు లీకేజీ వున్నా వాటిని వెంటనే రిప్లేస్‌మెంట్ చేయాలన్నారు. డిఇలు వారి పరిధిలోని మండలాల్లో పర్యటించి గ్రామాల్లో నీటి సమస్య వున్న ప్రాంతాలను గుర్తించి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎఇలు మండల పరిధిలోని పంచాయతీ సెక్రటరీతో సమన్వయం చేసుకుని ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేయించాలని, మంచినీరు సరఫరా అయ్యే పైపులు మరమ్మత్తులకు గురైతే మురుగు నీరు కలిసి కలుషితమై రకరకాల వ్యాధులు వచ్చే అవకాశం వుందన్నారు. నిరంతరం మంచినీటిని ల్యాబ్‌లకు పంపించి టెస్టింగ్ చేయించాలన్నారు. ఎఇలు, పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులతో చేసే పనులకు సంబంధించి బిల్స్‌ను వెంటనే జిల్లా పరిషత్‌కు పంపాలన్నారు. జడ్పీలో సత్వరం బిల్లులను క్లియర్ చేయాలని జడ్పీ ఎఓను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన చోట్ల బోర్లు డ్రిల్ చేసి వుంటే మోటర్లు బిగించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. విద్యుత్ శాఖ ద్వారా ఎదైనా సమస్యలు వుంటే సత్వరం తన దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలో గత 15 రోజుల వ్యవధిలో లీకేజీ అయిన 105 పైపులను గుర్తించి వెంటనే 105 లీకేజీ పైపులను సరి చేయడం జరిగిందన్నారు. 2024 సంవత్సరంలో ట్రాన్స్‌పర్టేషన్ ద్వారా 95 హ్యాబిటేషన్లకు నీటి సరఫరా చేశామని, గత 15 రోజుల్లో 17 గ్రామాల్లో నీటిని ట్రాన్స్‌పర్టేషన్ చేయడం జరిగిందన్నారు. అలాగే సిపిడబ్ల్యుఎస్ ద్వారా విజయపురం, నింద్ర మండలాల్లో 44 హ్యాబిటేషన్లలోని 21,722 జనాభాకు మంచినీరు అందించడం జరుగుతున్నదన్నారు. ఈ సమావేశంలో జడ్పీ ఎఓ, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇలు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి...
## ఎల్లప్పుడూ సిద్ధం : ఎంపీ మిథున్

సదుం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అన్నారు. గురువారం సదుం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎల్లప్పుడూ అందరికీ అందుబాటులో ఉంటానని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తప్పనిసరిగా పరిష్కరించి ఆదుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీ దారులతో సమావేశం మందిరం కిటకిటలాడింది. వచ్చిన ప్రతి ఒక్కరిని ప్రత్యేకంగా మాట్లాడించి వారి వద్ద నుంచి అర్జీలు తీసుకొని సమస్యను పరిష్కారానికి అధికారులకు ఫోన్లో మాట్లాడారు. అదేవిధంగా వివిధ రకాలైన హామీలను ఇచ్చారు. ఈ సందర్భంగా బూరగ మంద పంచాయతీ చీకల చేను గ్రామంలో డీలర్ ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని తగ్గించి ప్రజలకు పంపిణీ చేశారని ఆయనకు ఫిర్యాదు చేశారు. దాంతోపాటు చిత్తూరులో ఈనెల 22న నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి సమావేశాలకు హాజరు కావాలని ఆయనకు జిల్లా స్థాయిలో వచ్చిన విలేకరులు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. దాంతో పాటు సదుం బస్టాండ్ కూడలిలో భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహం ఏర్పాటు చేయాలని సదుం మండలం అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడంతో రాజంపేట ఎంపీ స్వంత నిధులతో ఏర్పాటు చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎంపీ ఎన్ రెడ్డప్ప, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి ఎంపీపీ మాధవి, మాజీ ఎంపీపీ వెంకటస్వామి సోమల మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మండల వైసీపీ అధ్యక్షుడు రెడ్డి జిల్లా వైసీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, సదుం సర్పంచ్ ఉషారాణి వైయస్ సర్పంచ్ బాబురెడ్డి, బురగమంద ఎంపీటీసీ మల్లికార్జున, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి,కమిటీ సభ్యులు అధ్యక్షులు మల్లెల గిరి, గౌరవ అధ్యక్షులు లోకంధం, సహాయ కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు. అంతకు ముందు వైసీపీ నాయకులు కార్యకర్తలు బూరగమంద క్రాస్ నుంచి మండల పరిధి కార్యాలయం వరకు స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఏ ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



వివిధ సమస్యలపై ఎంపికి వినతి పత్రాలు ఇస్తున్న ప్రజలు

## గణనాథుని దర్శించుకున్న ఎంపీ కేశినేని



**కాణిపాకం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని కుటుంబసమేతంగా గురువారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మృతి!



**కాణిపాకం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మృతి చెందిన సంఘటన కాణిపాకం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాణిపాకం-ఐరాల రోడ్డు జంగాలపల్లె క్రాస్ వద్ద బుధవారం రాత్రి జరిగింది. సంఘటనకు సంభందించి కాణిపాకం ఏఎస్సై సుబ్రమణ్యం కథనం మేరకు ఐరాల మండలం ఎగువ కామినాయనిపల్లెకు చెందిన రాజేం ద్రనాయుడు(65) తన భార్య లక్ష్మీతో కలసి ద్విచక్ర వాహనంపై జంగాలపల్లె వైపు నుండి స్వగ్రామానికి వెళుతుండగా ఐరాల వైపు నుండి కాణిపాకం వైపు ద్వి చక్ర వాహనంపై వెళుతున్న తవణంపల్లె మండలం కె.పట్నంకు చెందిన హరీష్ అనే వ్యక్తి ఢీ కొన్నాడు. ఈఘటనలో రాజేంద్రనాయుడుకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు, అలాగే ఘటనలో గాయపడిన హరీష్‌ను రాణిపేట సీఎంసీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## పోషణ్ పక్వాడాపై అవగాహన అవసరం



**ఐరాల, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** తల్లి, బిడ్డలు సురక్షితంగా వుండాలంటే ప్రభుత్వం అమలు చేస్తున్న పోషన్ పక్వాడా కార్యక్రమంపై గర్భిణిలు, బాలింతలకు అవగాహన అవసరమని ఐరాల ఐసీడీఎస్ సీడీపీఓ జి.నిర్మల అన్నారు. ఈనెల 8 నుండి 22వ తేదీ వరకు జరుగుతున్న పౌష్టికాహార వారోత్స వాల్లో భాగంగా విఎస్ అగ్రహారం, ఐరాల అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణిలు, బాలింతలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ పక్వాడా కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ధనలక్ష్మీ మాట్లాడుతూ తల్లి బిడ్డల క్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పోషన్ పక్వాడా కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో గర్భిణిలు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలువురు ఏఎన్‌ఎంలకు పదోన్నతులు





**రొంపిచెర్ల, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** రొంపిచెర్ల మండలంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినట్లు రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ తెలిపారు. సచివాలయాలలో గ్రేడ్3 ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న సుజాత, వెంకటేశ్వరి, గాయత్రిలకు గ్రేడ్ 2 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందారు. రొంపిచెర్ల 1 సచివాలయంలో పనిచేస్తున్న సుజాత పదోన్నతి పై పెద్దగొట్టిగల్లు హెల్త్ సబ్ సెంటర్‌కు బదిలీ కాగా, బొమ్మయ్యగారి పల్లి సచివాలయంలో ఏఎన్‌ఎంగా పని చేస్తున్న గాయత్రి రొంపిచెర్ల హెల్త్ సబ్ సెంటర్ కు బదిలీ అయినట్లు తెలిపారు. రొంపిచెర్ల2 సచివాలయ ఏఎన్ఎం గా పనిచేస్తున్న వేంకటేశ్వరి కూడా పదోన్నతి పొంది బదిలీ అయ్యారు.

## కాలేజీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ



**వడమాలపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు గురువారం పంపిణీ చేసినట్లు వడమాలపేట ప్రిన్సిపాల్ చంద్రమ్మ తెలిపారు. కళాశాలలోని సీనియర్ ఇంటర్ విద్యార్థులు 70 మందికి ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను అందజేశామన్నారు. ముందుగానే పాఠ్య పుస్తకాలు అందజేసిన ప్రభుత్వానికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## తుంబురుతీర్థ ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

**తిరుమల,ఏప్రిల్ 10 ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లోని పవిత్రతీర్థాలలో తుంబురుతీర్థముక్కోటికి ఎంతో విశిష్టత ఉంది. శుక్ర,శనివారాలు రెండురోజులు తుంబురుతీర్థంకు వెళ్ళేందుకు భక్తులకు ఉదయం మాత్రమే అనుమతినిస్తున్నట్లు టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. తీర్థానికి విశేషంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గురువారం మధ్యాహ్నం టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుమల అదనపుఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, విఎస్ఓ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## తిరుమలలో రాములమ్మ



తిరుమల,ఏప్రిల్ 10ప్రభాతవార్తప్రతినిధి: ఎంఎల్‌సి, సినీనటి విజయశాంతి చాలాకాలం తరువాత తిరుమలకు వచ్చారు. గురువారం ఉదయం నందమూరి కల్యాణ్‌రామ్,ఆమె ఇద్దరూ కలసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. "సన్నాఫ్ వైజయంతి" చిత్రం ఈనెల 18వతేదీ థియేటర్లలోకి వస్తుందని తెలిపారు. ఆలయం వెలుపల విజయశాంతితో సెల్ఫీలకు అభిమానులు పోటెత్తారు.

## తిరువీధుల నరహరికి డాక్టరేట్



**తిరుపతి,ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి తిరువీధుల నరహరికి డాక్టరేట్ ప్రదానం చేసింది. వర్సిటీ వాణిజ్యశాస్త్ర విభాగానికి చెందిన ఆచార్యులు మామిళ్ళ రాజశేఖర్ పర్యవేక్షణలో నరహరి "సర్వీస్ క్వాలిటీ ఇన్ బ్యాంకింగ్ సెక్టార్-ఎ స్టడీ విత్ రెఫరెన్స్‌టు ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్స్ ఇన్ వైఎస్ఆర్‌కడపడిస్ట్రిక్ట్ ఆఫ్‌ఆంధ్రప్రదేశ్"అనేఅంశంపై పరిశోధన వ్యాసం సమర్పించారు. దీనికిగాను పిహెచ్‌డి ప్రదానం చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లా నాయక్ తెలిపారు

## తిరుపతి శాంతిభద్రతలకు తొలిప్రాధాన్యత

**తిరుపతి,ఏప్రిల్ 10ప్రభాతవార్త:** తిరుపతి నగర డిఎస్పీగా ఎం.భక్తవత్సలం నియమితులయ్యారు. 28మంది డిఎస్పీల బదిలీల్లో పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఆయనను తిరుపతికి బదిలీ చేస్తూ రాష్ట్ర డిజిపి హరీశ్‌గుప్త ఉత్తర్వులు జారీచేశారు. ఆయన గతంలో రాయలసీమ జిల్లాల్లో పనిచేశారు. తిరుపతిలో శాంతిభద్రతల పరిరక్షణకు తొలిప్రాధాన్యతనిస్తానని తెలిపారు.గత మూడునెలలుగా తిరుపతి డిఎస్పీగా ఇన్‌ఛార్జిగా మహిళ డిఎస్పీ శ్రీలత బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో తిరుపతి డిఎస్పీగా జె.వెంకటనారాయణ బదిలీతో ఆయన స్థానంలో ప్రస్తుతం రెగ్యులర్ డిఎస్పీ నియమితులయ్యారు.

## సూర్యప్రభవాహనంపై గంగమ్మ ఊరేగింపు



**కుప్పం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** కుప్పం కొత్తపేటలో వెలసిన శ్రీ ప్రసన్న పెద్దపల్లి గంగమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం అమ్మవారిని సూర్యప్రభ వాహనంలో పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హిం చారు. ఈనెల12న అమ్మవారి కళ్యాణోత్స వం, 13న రథోత్స వం జరుగుతుందని ఆలయ ధర్మకర్త శివకుమార్, కార్యదర్శి వెంకటేష్, కమిటీ సభ్యులు తెలిపారు.

## జాతరకు... ప్రభుత్వవిప్‌కు ఆహ్వానం



**కుప్పం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కుప్పం శ్రీ పెద్దపల్లి గంగమ్మ ఆలయ ధర్మకర్త శివకుమార్, కార్యదర్శి వెంకటేష్, స్థానిక నేతలు కలిశారు. ఈ సందర్భంగా అమ్మవారి జాతర ఈనెల 19,20 తేదీల్లో జరుగుతుందని అమ్మవారి జాతరకు తప్పక హాజరు కావాలని ప్రభుత్వ విప్ కంచర్లకు వారు ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షణ్ముగం, నాగేంద్ర, కృష్ణన్, రాజా, మురుగన్, గోవిందరాజులు, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, యువనేత వాసు, స్థానికులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్ఎంయుఎ ఉద్యోగుల మహాధర్నా



**కుప్పం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** ఎన్ఎంయుఎ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో డిపో కార్యదర్శి జయపాల్ అధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఆర్నెల్లకు ఓసారి మెడికల్ చెకప్ నిర్వహించాలన్నారు. 1/2019 భద్రత సర్క్యులర్‌ను తప్పక అమలు చేయాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు డిజిటల్ గుర్తింపు కార్డులు ఇచ్చి ఉద్యోగుల భార్యలకు ఉచిత ప్రయాణ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు రెస్ట్‌రూంలు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు శ్రీను, మునస్వామి, బొట్టుమణి, ప్రసాద్ కుమార్, మునెప్ప, నారాయణ, శ్రీనివాసులు, ఖలీలుల్లా, ప్రసన్న, భాస్కర్, జయశంకర్, అరుణ్, వెంకటయ్య, చంద్రనాయక్, రాజా పాల్గొన్నారు.

## కండీషన్ బస్సులు ఇవ్వాలని వినతి



**కుప్పం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** కుప్పం ఆర్టీసీ డిపోకు కండీషన్‌లో ఉన్న పల్లెవెలుగు, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇవ్వాలని కోరుతూ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంకు ఎన్ఎంయుఎ డిపో అధ్యక్షుడు మునస్వామి, కార్యదర్శి జయపాల్, జాయింట్ కార్యదర్శి మునెప్పలు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వ హయాంలో కుప్పం డిపోలో ఉన్న బస్సులను పుంగనూరు, పలమనేరు తదితర ప్రాంతాలకు తరలించారన్నారు. మరలా ఎన్డీయే ప్రభుత్వం రావడంతో కొందరు అధికారులు అత్యుత్సాహం చూపి హడావుడిగా కండీషన్ లేని బస్సులు, కిలోమీటర్లు ఎక్కువ తిరిగిన బస్సులు డిపోకు తెప్పించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, కౌన్సిలర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 14న షూటింగ్ జట్టు ఎంపిక పోటీలు



**కుప్పంరూరల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** చిత్తూరు జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 14వతేది రామకుప్పం బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ మహేష్, ప్రెసిడెంట్ పవన్ కళ్యాణ్, వైస్ ప్రెసిడెంట్ లోకనాథ ం, కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. ఎంపికైన జట్లు ఈనెల 26,27 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే పోటీలకు హాజరవుతారన్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 01-04-2008తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. వివరాలకు 6301831236,9618330565నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కార్యదర్శి జబీర్, స్వాతి, సభ్యులు వేణు, సబిత పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకం



***గుడుపల్లె, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :*** ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయక మని రాష్ట్ర అధి కారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం వ్యవసా యశాఖ, మండల సమాఖ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో భూమిసారవంతం కావడంతో పాటు పెట్టుబడులు సైతం రైతులకు తగ్గుతాయన్నారు. నియోజకవర్గ అధికారి అమృతవల్లి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మరింత అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఎఫ్ఎ పున్నారావు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై వివరించారు. ఎపిఎం గ్రీటా మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా రైతు కుటుంబాలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు వెంకటరమణ, విఎఎ నవీన్, ఎఓ అమృత, ఎఇఒ నాగరాజు, మునికృష్ణ, భారతి, శ్రీదేవి, రూప, నాగరాజారెడ్డి, విజయనిర్మల, రైతులు పాల్గొన్నారు.

## గరుడవాహనంపై శ్రీసీతా సమేత కోదండరాముడు



**తవణంపల్లె, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** మండలంలోని అరగొండ వెలసిన శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గురువారం శ్రీసీతా సమేతుడైన కోదండ రాముల స్వామి గరుడవాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అలరించారు. ఆలయంలో ఈనెల 6నుండి శ్రీరామనవమి ఉత్స వాల్లో భాగంగా ఐదవ రోజు గురువారం రాత్రి స్వామివారికి గరుడవాహనసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి అరగొండ, పైమాఘంకు చెందిన యాదవ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. శ్రీసీతా సమేత కోదండరాముల సా ్వముల వారు అలంకరించిన గరుడవాహనంపై అధిరోహించి ఘనంగా ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రసాద్‌స్వామి. ఉత్స వ ఉభయదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## స్మశాన దారి సమస్యను పరిష్కరించండి

**పూతలపట్టు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** మండలం బూసుపల్లి గ్రామపంచాయతీ నందు స్మశానానికి దారి లేక ప్రజల బాధ వర్ణాతీతంగా మారినది దీనిపై తాసిల్దారు రమేష్ బాబు స్పందించి స్మశానానికి దారి స్మశానానికి కావలసిన స్థలాన్ని కేటాయించాలని తహశీల్దారు మంజూరు చేయవలసిందిగా గ్రామ ప్రజల కోరుకుంటున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రకృతి సేద్యంతో జీవవైవిధ్యం పెరుగుతుంది

**చౌడేపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:**



ప్రకృతి వ్యవసాయంతో మనుషుల్లో జీవవైవిధ్యం పెరుగుతుందని ఐకెపి ఎపిఎం సుబ్రమణ్యం అన్నారు. గురువారం స్థానిక మండల పరిపాలనా భవనం నందు రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో పిఎండిఎస్ నవధాన్యాల సాగుపై రైతుసమాఖ్య రైతులు, వెలుగు మహిళలకు అవగాహన కార్యక్రమం జరిగింది. వ్యవసాయంలో రసాయన మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. మండల వ్యాప్తంగా 146రైతుమిత్ర సంఘాలు, కాగతిలో 15ఎస్‌హెచ్‌జీ సంఘాలకు చెందిన మహిళా రైతులున్నారన్నారు. ప్రతి నెలా నవధాన్యాలసాగుపై అవగాహనా కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ ఎరువులు, జీవ, ఘనామృతంపై అవగాహన కల్పించారు. ఎంపిడిఓ కార్యాలయ సూపరిండెంటెంట్ నీసార్ అహమ్మద్, ఎఫ్‌పిఓ ఎపిఎం నీరజ, ఎన్ఎఫ్ఎ మహేష్, ఎంటి రెడ్డికుమారి, లోకేష్, రెడ్డెమ్మ, వెలుగు సిసిలు సుగుణ, గంగాధర, నాగరత్న, మనోజ్, శ్రీనివాసులు, రైతు, వెలుగు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## యనమసానిపల్లి పెళ్ళింట మాజీ మంత్రి



**చౌడేపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** మండలంలోని కాగతి పంచాయతీ యనమసానిపల్లిలో జరిగిన పెళ్ళికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. వైకాపా నాయకుడు ప్రకాష్‌రెడ్డి తనయుడు గిరినాథ్‌రెడ్డి, గౌతమిల వివాహ మహోత్స వంలో పాల్గొని నవదంపతులను ఆశీర్వదించారు. జడ్పీటీసీ నడింపల్లి దామోదర్‌రాజు, మాజీ ఎంపిపిలు కూరపర్తి అంజిబాబు, రుక్మిణమ్మ, వైకాపా నాయకులు కళ్యాణ్‌భరత్, రవిచంద్రారెడ్డి, నాగరాజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాకు విశేష స్పందన

**చౌడేపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:**



సీడాప్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థచే స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మండలం నుంచి 53మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కాగా వారిలో 13మంది వివిధ రంగాల్లోని ఉద్యోగాలకు ఎంపికయ్యారని వెలుగు ఎపిఎం సుబ్రమణ్యం తెలిపారు. డిపిటి లోకేష్, జెసిబి రెడ్డెమ్మ, సిసిలు సుగుణ, గంగాధర, నాగరత్న, మనోజ్, శ్రీనివాసులు, నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్రిక్తత



**చౌడేపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** తమ బిడ్డకు మాయమాటలు చెప్పి పెళ్ళి చేసుకొన్నాడంటూ యువతి తల్లిదండ్రులు, బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లికి చెందిన అనూహ్య, చారాల పంచాయతీ బీర్జేపల్లికి చెందిన వంశీలు ప్రేమ వివాహం చేసుకొన్నారు. దీంతో అమ్మాయి తరపున తల్లిదండ్రులు, బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని తమ బిడ్డను అప్పగించాలని కొంత సేపు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో స్వత్ప ఉద్రిక్త వాతావరణం నెలకొనింది. స్పందించిన పుంగనూరు రూరల్ సిఐ రాంభూపాల్ పరిస్థితిని సద్దు మణిగించారు. ఈక్రమంలో జిల్లా కేంద్రం చిత్తూరులో మేజర్లు అయిన తాము ప్రేమ వివాహం చేసుకొన్నామనీ, రక్షణ కల్పించాలని అధికారులను కోరుతున్న ప్రెస్‌మీట్ వీడియో సామాజిక మాధ్యమాల ద్వారా హల్‌ఛల్ చేసింది.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం...

### ప్రభుత్వ వైద్య అధికారుల అజాగ్రత్త



***పూతలపట్టు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :*** పూతలపట్టు మండలంలోని ప్రభుత్వ వైద్య అధికారులు విద్యుత్ అధికారులు పర్యవేక్షణ లోపం వలన పూతలపట్టు మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యుత్ తీగలు స్థానికులకు అందేలా అంబులెన్స్‌కు మరి ఇతర వాహనాలకు తగిలేలా విద్యుత్ తీగలు ఉన్నాయి. విద్యుత్ తీగలు ఏడు లేక ఎనిమిది అడుగులు ఎత్తులో ఉండడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక రోజుకి వందల సంఖ్యలో చికిత్స కోసం వస్తుంటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది రోగులకు చికిత్స మాత్రమే కాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపల ఎలాంటి పరిస్థితులు పరిశీలించాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున విద్యుత్ అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రమాదాల నుండి కాపాడాలని పూతలపట్టు ప్రజలు కోరుతున్నారు.

## కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



**పలమనేరు,ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** గత ప్రభుత్వంలో బైరెడ్డిపల్లెలో జరిగిన సంఘటనపై బైరెడ్డిపల్లె పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుకు బుధవారం పలమనేరు కోర్టుకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరుకావడం జరిగింది. గత ప్రభుత్వంలో బైరెడ్డిపల్లెలో జరిగిన సంఘటనపై బైరెడ్డిపల్లెకు వెళ్లిన అమరనాథరెడ్డితో పాటు మరి కొందరిపై కేసు నమోదు కావడం జరిగింది.ఆ కేసు విచారణకు ఎమ్మెల్యేతో పాటు కేసులోని మరి కొందరు నాయకులు కోర్టుకు హాజరుకావడం జరిగింది.

## తీర్థం గ్రామానికి బస్సు సర్వీసులు

**పలమనేరు,ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** బైరెడ్డిపల్లె మండలం తీర్థం గ్రామానికి నూతన బస్సు సర్వీసులను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం ప్రారంభిం చారు. బైరెడ్డిపల్లె తీర్థం గ్రామస్తులు వారి గ్రామానికి ఎంతో కాలంగా ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేయాలని కోరగా ఎమ్మెల్యే స్థానిక ఆర్టీసి డిఎం స్వామి తో చర్చించి పలమనేరు నుండి తీర్థం గ్రామానికి నూతన ఆర్టీసి బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. అనంతరం తీర్థం గ్రామ పంచాయితీలో 130 మంది లబ్ధిదారులకు ఆయన ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాదవరాజు,మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి తదితరులు పాల్గొన్నారు.

---

## ఐఎన్టీఎస్ఓ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



**తొట్టంబేడు,ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతి ఏడాది నిర్వహించే ఇండియన్‌నేషనల్ టాలెంటెడ్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థులు గొప్ప ప్రతిభను చూపుతున్నారు. అదేవిధంగా ఈఏడాది జరిగిన ఐఎన్‌ఎస్టీఓ లెవల్-1లో గెలుపొందిన విద్యార్థులు లెవల్-2 పరీక్షలు రాయగా ఇందులో లేఖనా స్థాయి(ఎస్) ఆరోతరగతి విద్యార్థిని మొదటి బహుమతిని సాధించి లిన్నోవ ట్యాబ్‌ను బహుమతిగా అందుకుంది. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రూపాదేవి మాట్లాడుతూ మంచి ప్రతిభలో మొదటి బహుమతిని సాధించిన లేఖ స్థాయిని అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జులు త్రివేణి, కల్పన, డీన్ సుబ్రమణ్యం, ఇన్‌ఛార్జులు గాయత్రి, భువనేశ్వరి, బాలజీ, కో ఆర్డినేటర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌బియ్యాన్ని సద్వినియోగం చేసుకోండి..తహశీల్దార్

తొట్టంబేడు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : తహశీల్దార్ మధుసూధనరావు మాట్లాడుతూ మండలంలో 36 చౌకదుకాణాల ద్వారా 13,338మందికి 11 ఎండియు ఆపరేటర్ల ద్వారా బియ్యం పంపిణీచేస్తున్నామని అయితే ఈబియ్యంను ప్రజలు అమ్ముకుంటున్నారని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. ఆకలి తీర్చేందుకు మంచి బియ్యం పంపిణీచేస్తున్న ప్రభుత్వం లక్ష్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే కొన్నలిలో రీసర్వే పూర్తయిందని, ఇక చిన్నసింగమాల, కళ్ళిపూడి గ్రామాల్లో రీసర్వే జరుగుతోందన్నారు. రెవెన్యూ సమస్యలు లేకుండా చేయడమే తమ లక్ష్యమన్నారు. త్వరలోనే సచివాలయాల వద్ద కూడా బియ్యం పంపిణీచేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.



## ఇంటి పట్టాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తాం

### - టీడీపీ మాజీ గ్రంథాలయ ఛైర్మన్ కన్నయ్య



**బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** ఇంటి పట్టాల కోసం కనమనంబేడు గ్రామం దళితులు సీపీఐ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షను సందర్శించి అర్హులైన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని తెలుగుదేశం పార్టీ మాజీ గ్రంథాలయ ఛైర్మన్ కన్నయ్య నాయుడు తెలిపారు. గురువారం ఇంటి పట్టాల కోసం రిలే నిరాహారదీక్ష చేస్తున్న శిబిరాన్ని సందర్శించి విషయం తెలుసుకున్నారు. ఇంటి పట్టాల కోసం కనమనంబేడు గ్రామం దళితులు సీపీఐ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇంటి పట్టాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, కనమనంబేడు గ్రామ దళితులు పాల్గొన్నారు.

## నిరుపేదల కష్టాలు తీర్చేందుకే గావ్ చలో బస్తీ చలో

**వేదురుకుప్పం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేదల కష్టాలను తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం చేపట్టినట్లు బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బోడిరెడ్డి హనుమంత రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ప్రబాహణపల్లి సమీపంలో గల యానాది కాలనీలో గురువారం బిజెపి మండల అధ్యక్షుడు బోడికరెడ్డి అశోక రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇక్కడ పర్యటించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన కాలనీలోని ప్రజల కష్టాలను, సమస్యలను తెలుసుకుని కూటమి ప్రభుత్వం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ క్రమంలో కాలనీవాసుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ఉపాధ్యక్షుడు సోమశేఖర్ రాజు, కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యం రెడ్డి, రాజేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు శేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ నెల 13న 5వ తరగతి, ఇంటర్‌కి ప్రవేశ పరీక్షలు

**పుత్తూరు రూరల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 13వ తేదీ అర్హత పరీక్ష నిర్వహించబడుతుందని ప్రిన్సిపాల్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు.పరీక్షకు మాజరయ్యే వారు హాల్‌టికెట్‌తో పాటు విద్యార్థి ఆధార్‌కార్డును తీసుకుని రావాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

## మద్రాసుబాబును కోల్పోవడం తీరని లోటు

***గుడిపాల, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:*** మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు విజయకుమార్ అలియాస్ మద్రాసు బాబును కోల్పోవడం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు పేర్కొన్నారు. మద్రాసు బాబు 18వ వర్ధంతి పురస్కరించుకుని గురువారం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మద్రాసుబాబు చిత్రపటానికి పూలమాల వేసి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఇతర పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, ఎంపిటిసీ తుమ్మల సాంబశివనాయుడు, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, కార్యాలయ కార్యదర్శి కిట్టు, నాయకులు నాగరాజుయాదవ్, గోవందగౌడ్, జయదేవనాయుడు, గురుస్వామి, అర్జున్‌గౌడ్, గోపి, బాలసుబ్రమణ్యం, రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిఎం పర్యాటన నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

**తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యాటన నేపథ్యంలో కడపజిల్లాలోని ఒంటిమిట్ట శ్రీరాములవారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా తిరుపతి జిల్లా నుండి కడపజిల్లాకు వెళ్ల హెవీ వాహనాలు భాకారపేట, వయా పిలేరు, రాయచోటి మీదగా ట్రాఫిక్ మళ్ళించడం జరుగుతుందని ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణ తెలిపారు. జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో ట్రాఫిక్ చర్యలు చేపట్టిన డిఎస్పి రామకృష్ణచారి మాట్లాడుతూ ఈ నెల 11వ తేది ఉదయం నుండి ఎల్లుండి అనగా 12వ తేది ఉదయం 9 గంటల వరకు కడపకు వెళ్ళు హెవీ వెహికిల్స్‌ను తిరుపతి నుండి భాకారపేట వయా పిలేరు మీదగా రాయచోటి నుండి కడపకు వెళ్లాలి. అదేవిధంగా హెవీ వెహికల్స్ కడప నుండి తిరుపతికి రావాలంటే కడప రాజచోటి మీదగా పీలేరు నుండి రాయచోటి మీదగా భాకారాపేట నుండి తిరుపతి రావలేనని తెలిపారు. ట్రాఫిక్ మళ్ళింపునకు వాహన చోదకులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

## ప్రేమికురాలు మృతిపై పోలీసు దర్యాప్తు వేగవంతం

**చంద్రగిరి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** నరశింగాపురంకు చెందిన ప్రేమికురాలు (మైనర్ బాలిక) మృతి కేసు దర్యాప్తును సిఐ సుబ్బరామిరెడ్డి వేగవంతం చేశారు. రామచంద్రాపురం మండలం, నెత్తకుప్పంకు చెందిన అజయ్, నరశింగాపురంకు చెందిన బాలిక ఇద్దరూ ప్రేమలోపడి బాలిక గర్భం దాల్చడంతో తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు అజయ్‌పై ఫోక్సో కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఇదిలావుండగా అజయ్ దాదాపు 5 మాసాలు జైల్లో గడిపి బైయిల్‌పై ఈ మధ్యనే బయటకు వచ్చాడు. కాగా బాలిక గత శుక్రవారం మృతి చెందగా, అత్యవసరంగా తల్లి అంత్యక్రియలు చేయించినట్లు సమాచారం. అయితే బాలికది సహజ మరణం కాదని గ్రామస్థులు నుండి తెలుసుకున్న పోలీసులు ఆ మేరకు అనుమాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ శివరామసుబ్బయ్య, సిఐ సుబ్బరామిరెడ్డి గురువారం తమ సిబ్బందితో బాలికను అంత్యక్రియలు నిర్వహించిన ప్రదేశానికి క్లూస్ టీమ్‌ను తీసుకువెళ్ళి అస్తికలు సేకరించారు.

## ఎక్కడ పని చేసినా... నిబద్ధతతో పనిచేయాలి

**రేణిగుంట ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** విధి నిర్వహణతో పాటు సమాజ సేవకు తిరుపతి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిఐ మధుసూదన్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారని వక్తలు అన్నారు. తిరుపతి రైల్వేప్రొడక్షన్ ఫోర్స్ సిఐగా దాదాపు రెండున్నర సంవత్సరాలు విధి నిర్వహణ చేసి విజయవాడ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిఐడి వింగుకు బదిలీపై వెళ్తున్న మధుసూదన్‌కు తిరుపతి ఆర్‌పిఎఫ్ బ్యారక్ నందు గురువారం వీడ్కోలు సభ జరిగింది. మధుసూదన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, విధి నిర్వహణతో పాటు, ఆర్పిఎఫ్ సిబ్బంది సంక్షేమానికి, సమాజ సేవకు ఎక్కువ సమయాన్ని కేటాయించే వారన్నారు. అనంతరం పలువురు రైల్వే అధికారులు, నగర ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు, సహ ఉద్యోగులు ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ బదిలీలు ప్రభుత్వ ఉద్యోగులకు తప్పదన్నారు. అయితే ఎక్కడ పని చేసిన నిబద్ధతతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్, తిరుపతి ఎస్ఎంఆర్ చిన్నపరెడ్డి, తిరుపతి ఐపిఎఫ్ సందీప్ కుమార్, రేణిగుంట ఐపిఎఫ్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, ఆర్పిఎఫ్ సిబ్బంది, పాల్గొన్నారు.



## ముదిరాజులకు ఎమ్మెల్సీ ఇవ్వకపోవడం అన్యాయం

**రేణిగుంట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది ముది రాజులు ఉన్నారని వారికి ఒక్క ఎమ్మెల్సీ కేటాయించకపోవడం అన్యాయం అని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రేణిగుంట మండలం కరకంబాడి శ్రీ కట్ట పుట్టలమ్మ దేవస్థానాన్ని ముదిరాజ్ సంఘం నాయకులు కోమటి విష్ణువర్ధన్, పాము రవికుమార్, బోనం శేషగిరిరావు, కనకట్ల మోహన్‌రావు, పోరుమామిళ్ల వీరన్న, మణి, మీరా రాజేష్ బుధవారం దర్శించు కున్నారు. వీరికి దేవస్థానం శాశ్వత ధర్మకర్త కుర్రకాలువ వాసు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం వీరికి తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు.



## టీడీపీ నేతకు నివాళులర్పించిన ఎమ్మెల్యే

**కేవీబీ పురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలం దిగువ పుత్తూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నేత మునస్వామి పది రోజుల క్రితం మృతి చెందారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే ఆదిమూలం దిగువ పుత్తూరు గ్రామానికి చేరుకుని మునస్వామి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిం చారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆయనతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చేబ్రోలు కిరణ్‌పై... పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు

**బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి జగన్ భార్య భారతిపై టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ అసభ్య పదజాలంతో యూ ట్యూబ్‌లో వ్యాఖ్యానించడంపై గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు మణినాయుడు, సత్యవేదు నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ వేలూరు రాకేష్, రాష్ట్ర ఎస్సీ సెల్‌అధ్యక్షుడు ఉగ్గుమూడి గురునాథం ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడవాళ్ళపై అసభ్య పదజాలం వాడడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని, ఈ ధోరణి మారకపోతే కూటమి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు మణినాయుడు, సత్యవేదు నియోజకవర్గ జేసీఎస్ కో కన్వీనర్ వేలూరు రాకేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉగ్గుమూడి గురునాథం, వైసీపీ నాయకులు ఉగ్గుమూడి రాజశేఖర్, గోపాల్‌రెడ్డి, అమర్ లింగం, బాబురెడ్డి, సర్పంచ్ ప్రసాద్ పాల్, మాజీ సర్పంచ్ గురవయ్య, సర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.



## మహిళాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి : పులివర్తి సుధారెడ్డి

**చంద్రగిరి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** మహిళాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అగరాల, కందులవారి పంచాయతీలలో గురువారం ఆమె మహిళలతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. అగరాల, కందులవారిపల్లి పంచాయతీలలో సుమారు రూ.3 కోట్లు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. అదేవిధంగా రంగంపేట నుండి భీమవరం వరకు పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేసి ఇంటింటికీ అభివృద్ధి ఫలాలను అందిం చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ క్రమంలో మహిళలకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న అనేక పథకాలను వివరించిన ఆమె వారి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, తుడా మాజీ డైరెక్టర్ ఏజి పల్లి బాల, జయచంద్రారెడ్డి (జెసిఆర్), నిరంజన్ నాయుడు, గోవర్ధన్, తోట చంద్రబాబు, చైతన్య, గిరి, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన కాలనీలో నీటి సదుపాయం

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** గత కొంత కాలంగా రాజీవ్‌నగర్ కాలనీలో మంచినీటి సమస్య చోటు చేసుకుంది. ఈ సమస్యను పార్టీ వర్గాలు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఆయన వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులతో చర్చించి, అక్కడ బోరు వేసి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, లేదా రిజర్వాయర్ నుంచి కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి గిరిజనుల దాహార్తిని సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ అధికారులు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌లు కలిసి కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటు చేసారు. రాజీవ్ నగర్‌లో మౌళిక సదుపాయాల కల్పనకు ఎంఎల్ఏ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని విజయకుమార్ వివరించారు. ఈ కార్యక్రమాల్లో విజకుమార్‌తో పాటు మున్సిపల్ ఎఇఇ శేఖర్ రాజీవ్‌నగర్‌కు చెందిన విఆర్ఓ, గురవయ్య, సురేష్, అమరావతమ్మ, తుసమ్మ, అరుణ్,శివ, చెంచయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## పోషణ పక్వాడాపై అవగాహన కార్యక్రమం

**శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ పంచాయతీలోని ఎస్.ఎన్ కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఎస్ఎన్ కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శాంతిదుర్గ సూచనలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గర్భ వతులు, బాలింతలు, కిషోరబాలికలు కూడా పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాఠశాలల్లో ఉన్న చిన్నారుల ఎత్తు, బరువును ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది జయశ్రీ, గీత, ఓజశ్వని, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల మద్దతుతో పోరాటాలు

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** ప్రజలు ఇస్తున్న ఆర్థిక, నైతిక మద్దతుతో ప్రజాక్షేత్రంలో అలుపెరగని పోరాటాలు చేస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. మే 8న తిరుపతిలో ప్రారంభం కానున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల విజయవంతం కోసం గురువారం పట్టణంలోని ఆర్థిక విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. జోలిపట్టి ఆర్థిక నైతిక సహకారాన్ని అందించాలని ప్రజలను అర్థించారు. సిపిఎం ఆర్థిక విరాళాల సేకరణ కార్యక్రమానికి ప్రజలు నైతిక సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి గంధమణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, గురునాథం, రాధమ్మ, సుబ్రమణ్యం, ప్రసాద్, ప్రవళ్ళిక, రాజ తదితరులు పాల్గొన్నారు.





## ఉచిత వైద్య శిబిరం

**తిరుపతిరూరల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** వన్నెకుల క్షత్రియ కార్పోరేషన్ స్టేట్ డైరెక్టర్, ముత్యాలరెడ్డిపల్లి జనసేన అధ్యక్షుడు ఐయ్యంగారి బాలసుబ్రమణ్యం మరెన్నో పదవులు చేపట్టాలని జనసేన రాష్ట్ర నాయకులు డాక్టర్ హరిప్రసాద్, వన్నెకుల క్షత్రియ కార్పోరేషన్ చైర్మెన్ సి.ఆర్.రాజన్ అన్నారు. గురువారం బాలసుబ్రమణ్యం జన్మదిన వేడుకలను ముత్యాలరెడ్డిపల్లి అన్నా క్యాంటీన్ వద్ద ఘనంగా నిర్వహించారు.అలాగే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మౌళి, రంగారెడ్డి, శ్రీజనత సేవా మిత్ర హెల్పింగ్ హ్యాండ్ అధ్యక్షుడు కిరిటిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌డబ్ల్యుపిసిపై అవగాహన శిక్షణ

**తిరుపతిరూరల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** తిరుపతి రూరల్ పెరుమాళ్ళపల్లి చెత్త సంపద కేంద్రంలో గురువారం ఎస్‌డబ్ల్యుపిసిపై ఐదు మండలాల పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర సంబంధించి ఎస్‌డబ్ల్యుపిసి నిర్వాహణ ఎలా చేయాలి, గ్రామాలు ఎలా శుభ్రంగా ఉంచుకోవాలి, శుభ్రతలో గ్రీన్ పాత్ర ఎమిటి, చెత్తను ఏవిధంగా విభజించాలి తదితర అంశాలపై చర్చించారు. జిల్లా కో-ఆర్డినేటర్ శిరీష, డిఆర్పీలు కిశోర్, భరత్, పంచాయతీ కార్యదర్శి ఎస్‌డబ్ల్యుపిసిపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో చిన్నగొట్టుకల్లు, ఎర్రవారిపాళ్యం, చంద్రగిరి, కెవిబి పురం, పాకాల మండలాలకు సంబంధించి 80 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




## సంపును పరిశీలించిన ఎమ్మెల్యే

**తిరుపతిరూరల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** అవిలాల సంపును పునరుద్దరిస్తే ఐదారు పంచాయతీల దాహార్తిని తీర్చవచ్చునని ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారు లకు సూచించారు. 150 బైపాస్ రోడ్డులో నిరుపయోగంగా ఉన్న అవిలాల సంపును గురువారం ఎమ్మెల్యే పులివర్తి నాని పరిశీలించారు. సంపును రెడీ చేస్తే శ్రీనివాసపురం, పద్మావతీపురం, ఓటేరు, వేదాంతపురం, సాయినగర్, అవిలాల, గాంధీపురం పంచాయతీల దాహార్తిని తీర్చవచ్చునని తెలిపారు. వేదాంతపురం పంచాయతీలో మరో 2నూతన బోర్లు డ్రిల్ చేసి, నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామచంద్ర, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, సర్పంచ్‌లు అవిలాల రమణ, చెఱకుల జనార్ధన్ యాదవ్, శ్రీనివాసపురం ఉప సర్పంచ్ సునీల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



## పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు శ్రమించాలి

**తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించి,పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు సమాయత్తం కావాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతినాయుడు పిలుపునిచ్చారు. గురువారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన 80వ వార్సికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ అకడమిక్ విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్ వంటి వాటిపై పట్టుసాధించినప్పుడే పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనగలమని తెలిపారు.విద్యార్థులు కఠోర శ్రమతో ఉన్నత శిఖరాలను అదురోహించి కళాశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిం చడం గర్వంగా ఉందన్నారు. బీఏలో 92శాతం,బీకామ్ లో 93శాతం,బీఎస్సీలో 90శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మళ్ళీ కార్జున,విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రియభక్తుడి భుజస్కంధాలపై శ్రీరామచంద్రుడు

**చంద్రగిరి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** ప్రియభక్తుడైన హనుమంతుని వాహనంగా చేసుకుని శ్రీరామచంద్రుడు చంద్రగిరి పట్టణ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. టిటిడి అనుబంధ శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో రాములవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో గురువారం స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస భట్టార్ వాహన విశిష్టతను వివరిస్తూ శ్రీరామచంద్రుడి దాస్య భక్తుల్లో హనుమంతుడు అగ్రస్థానంలో నిలుస్తాడని అన్నారు. హనుమంతుడిని వాహనంగా చేసుకుని విహరించే శ్రీరామచంద్రుడిని దర్శించుకోవడం ద్వారా మోక్షప్రాప్తి కలుగుతుందని అన్నారు. ఈ వాహన సేవలో ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఆలయ సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ముని హరిబాబు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్ళండి!

**చంద్రగిరి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్ళి విస్తృత సాయిలో అవగాహన కల్పించాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ రాజు అన్నారు. స్థానిక బైపాస్ రోడ్డు వద్ద గురువారం బిజెపి చంద్రగిరి అసెంబ్లీ క్రియాశీలక సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంచెలంచెలుగా ఎదిగిన బిజెపి ఆవిర్భావాన్ని గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటమునిి, పెనుబాల చంద్రశేఖర్, కార్యదర్శులు హరినాథ్ రెడ్డి, శ్రీదర్‌బాబు, నాయకులు సుబ్రమణ్యం యాదవ్, సక్కుర్ మునిగంగిరెడ్డి, చైతన్య రెడ్డి, సునీల్‌కుమార్, దీనదయాల్ నాయుడు, దొరస్వామి, కృష్ణమూర్తి, జనార్ధన్ నాయుడు, ఈశ్వర్, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.



## బాటసారులకు చల్లని మజ్జిగ,పానకం పంపిణీ

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రజలు, దూర ప్రాంతాల నుంచి శివయ్య దర్శనానికి వచ్చే యాత్రికులకు స్వయంభువు(పొగస్వామి) స్వామి తన సామాజిక కార్యక్రమాల్లో భాగంగా చల్లని మజ్జిగ, పానకం అందిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం భక్తులకు చిన్నపిల్లలకు పాలను అందిస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని విన్నూత్నంగా చల్లటి మజ్జిగ, పానకలం, జ్యూస్‌లను అందిస్తున్నారు. ఈ కార్యక్రమాలను నిర్వహిస్తూ దాతలను ఆకట్టుకుంటున్నారు.

## వక్ఫ్‌బిల్లుపై నిరసకు 14న చలో నెల్లూరు

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బిల్లుపై మైనారిటి ముస్లింలుఈ నెల 14 సోమవారం నెల్లూరులో జరిగే ఆందోళన కార్యక్రమాలకు హాజరు కావాలని అక్కడ నిర్ణయించారు. గురువారం జామియా మస్‌జిద్‌లో హాఫీజే ఖుర్ ఆన్ మౌలానా రేహాన్‌సాహెబ్ అధ్యక్షతన నియోజకవర్గంలోని మైనారిటి ముస్లింలు సమావేశమయ్యారు.ఈ సందర్భంగా వక్ఫ్‌బిల్లుపై కేంద్రంలోని బిజెపి దాని మిత్రపక్షాలు వక్ఫ్‌బిల్లును ఆమోదించటంతో మైనారిటి ముస్లింలో తీవ్ర ఆందోళన చోటు చేసుకుంది. ఒక్కొక్క మసీదు నుంచి జనసమీకరణకు బాధ్యతను అప్పగించారు. భారీ ఎత్తున 'నెల్లూరులో జరిగే ఆందోళన'కు హాజరు కావాలని నిర్ణయించారు.

## పురాతన కళా ఖండాలను కాపాడండి

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయం పురాతన కళాఖండాల్ని ప్రాశస్త్యం కల్గిన చోటులను కాపాడాలని శ్రీకాళహస్తి పరిరక్షణ క్షేత్ర సమితి అధ్యక్షులు ప్రకాశంశాస్త్రి గురువారం ఓప్రకటనలో కోరారు. ఆయన అందించిన సమాచారం మేరకు శివం టు శివం రోడ్డు నిర్మాణంలో స్వర్ణముఖి నది దుర్గాంబ కొండ చరియల్లో ఏనుగు గంటలలో ఉన్న రాతి ఏనుగు బొమ్మలను కాపాడాలని ఆయన దేవస్థానం అధికారులను కోరారు. మూడు క్రిమి కీటకాల పేరుతో దివ్యక్షేత్రం వెలసింది. ఎన్నో తీర్థాలు, కైలాసనాధుని మూగజీవాలు ఆరాధించిన తీరుకు నిదర్శనంగా ఎన్నో కళాఖండాలున్నాయి .ఈ ఆనవాళ్లను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయాలను పొందుపరుస్తూ ఎన్నో గ్రంధాలున్నాయి. శ్రీకాళహస్తి స్థల పురాణం 56 ఆధ్యాయంలో శ్లోకం: కనకాద్యుత్తరేదేశేనధ్యాం తీర్థేవ్వనామకే స్నాత్వ జలం సమాదాయ సర్వపాప ప్రణాశవే అని చెప్పబడిందన్నారు. ప్రస్తుతం సుమారు 28 కోట్లుతో శివం టు శివం రోడ్డు మార్కింగ్ జరుగుతుంది. కాబట్టి ఏనుగు శిలలను భిన్నంకాకుండా చూడాలని కోరారు.



## ఆలయాలు భక్తి ఆలవాలం: కరుణాకర్‌రెడ్డి

**శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** సమాజంలో రోజు రోజుకు పెరుగుతున్న రుగ్మతలకు అడ్డుకట్టవేయాలంటే వాడ వాడల్లో ఆలయాలు వెలవాలని మాజీ టిటిడి ధర్మకర్తల మండలి చైర్మెన్ వైకాపా జిల్లా రథ సారధి భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం చిందేపల్లి గ్రామంలో తిరుపతి నియోజకవర్గ ప్రజలకు గతపాలనలో జగనన్న ప్రసాదించిన ఇళ్ళ వద్ద రామిశెట్టి వెంకయ్య దంపతులు నూతనంగా గుర్రప్పస్వామి ఆలయాన్నినిర్మించారు. ఈ ఆలయాన్ని గురువారం భూమన కరుణాకర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్స వానికి వచ్చిన ఆయనకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఉన్నారు. భక్తి భావం పెంపొందించుటకు రామిశెట్టి వెంకయ్య దంపతులు గుర్రప్పస్వామి ఆలయాన్ని నిర్మించటం తనకు ఎంతో గర్వ కారణంగా ఉందన్నారు. అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ కమ్యూనిస్టు బావాలు కల్గిన రామిశెట్టి వెంకయ్య గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించుటకు ఆలయాలు నిర్మించటం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి చిత్తూరుజిల్లా వైయస్ఆర్‌పి ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు సాధన మునస్వామిరాయల్, యువజన అధ్యక్షుడు శ్రీవారి సురేష్, మాజీ కౌన్సిలర్ కంఠా ఉదయ్‌కుమార్, ఎంఆర్ మురళియాదవ్, మణి,మునిబాబు, చంద్రారెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.



# తిరుపతి డివిజన్

## డబ్లింగ్ పనులకు కేంద్రం ఆమోదం




**పాకాల, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** గత సంవత్సరం అక్టోబర్ మూడవ తేదీన వార్త పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన కూటమి ప్రభుత్వ యంత్రాంగం చిత్తూరు ఎం పి దగ్గుమళ్ల ప్రసాద్ ఎన్నికల హామీ మేరకు 104కిలో మీటర్ల మేర తిరుపతి పాకాల కాట్పాడి రైలు మార్గంలో మొత్తం 7పై ఓవర్లు కాగా అందులో పాకాలకే రెండు ఫ్లైఓవర్లు కేటాయించటం జరిగింది. మొత్తం మీద డబ్లింగ్ పనులకు 1332 కోట్ల రూపాయల పనులకు కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఏపి నారా యువశక్తి మచ్చా దొరస్వామి నాయుడు, నారా సుబ్రహ్మణ్యం నాయుడు పాకాల మండల ప్రజలు ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నారు.

## భక్తులను ఆకట్టుకున్న నామ సంకీర్త నామాలు

**పుత్తూరు రూరల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని కాపు వీధిలో వెలసిన శ్రీ కోదండరామస్వామి ఆలయం(నోములగుడి)లో శ్రీ కోదండ రామస్వామి కల్యాణోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం, ఆలయ ఆవరణలో డాక్టర్ కోలూరు వందన శిష్య బృందం, చిట్టమూరి, ప్రణతి ఆధ్వర్యంలో నామ సంకీర్తనామాలు కార్యక్రమం నిర్వహించారు. అలాగే శ్రీ కోదండరామ స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి, అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎస్వీ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కాలేజీ వైష్ణవి, శ్రావణి, రమ్య, గౌతమి, తేజశ్రీ, మనిషా,నందిని, సాయికిరణ్, శ్రీరామ్, ఎం.శ్రీవాణి, కవిరాజు పాల్గొన్నారు.



## పోషన్ పక్వాడను సద్వినియోగం చేసుకోండి : సీడీపీవో

**కేవీబీ పురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ పిచ్చాటూరు ప్రాజెక్టు సీడీపీవో శోభారాణి అన్నారు. కేవీబీ పురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.సీడీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు గర్భం దాల్చిన రోజు నుంచి రెండు సంవత్సరాల వరకు వారికి కావలసిన పోషక పదార్థాలతో పాటు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలేనని అన్నారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కల్పలత, సుమతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.



## దరఖాస్తులకు వచ్చేనెల 5వరకు గుడువు

***తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :*** రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు ఏపీ పీజీసెట్ 2025నిర్వహణ బాధ్యతను ఎస్వీయూకు అప్పగించిన నేపథ్యంలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. బుధవారం ఎస్వీయూ వీసీ ఛాంబర్లో ఆయన కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లతో కలసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాలో 35పరీక్షా కేంద్రాలలో 153 కోర్సులకు 31 పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అపరాధ రుసుము లేకుండా మే 5వ తేదీలోపు ఆన్లైన్లో ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అపరాధ రుసుముతో మే 25వ తేదీన గుడువు ముగియనుందని తెలిపారు.



## వాల్మీకి చరిత్ర పుస్తకావిష్కరణ

**తిరుపతి,ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ ముద్రించిన వాల్మీకి చరిత్రముఖిగ్రంథాన్ని బుధవారం వీసీ ఆచార్య చిప్పాడ అప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నిధులతో ప్రాచ్య పరిశోధన సంస్థ రఘునాథ నాయకుడు రాసిన వాల్మీకి చరిత్రముఖి గ్రంథాన్ని ముద్రించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ గ్రంథాన్ని సంస్థ సంచాలకులు ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు వచనంలో భావానువాదం చేశారని తెలిపారు. వాల్మీకి మహర్షిగా మారక ముందు ఆయన జీవన సరళి ఇందులో సవివరంగా వివరించడం జరిగిందన్నారు. కిరాతుడుగా బ్రతికిన మనిషి సప్తర్షులు ప్రభావంతో మహర్షిగా మారి, సంస్కృత ఆదికావ్యం రామాయణం నిర్మించిన చరిత్ర ఈ గ్రంథలో వుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్‌కే సురేంద్ర బాబు,సిబ్బంది పాల్గొన్నారు.



## బూచివానత్తంలో పారిశుధ్య చర్యలు

***విజయపురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:*** మండలంలోని బూచి వా నత్తంలో గురువారం పారిశుధ్య చర్యలు నిర్వహించారు. అంకమ్మ కాలనీ వీధుల్లో చెత్తా చదారాన్ని సర్పంచ్ గోపాల్ ట్రాక్టర్‌తో తరలించి పారిశుధ్య చర్యలు నిర్వహిం చారు. పారిశుధ్య పనులను ఎంపీడీవో రాజేంద్ర, పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



## విజయపురంలో శ్రీరాముని కల్యాణోత్సవం

**విజయపురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన విజయపురంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఉదయం గోపూజ, కలశ స్థాపన, యాగశాల పూజ, కర్పూర హారతి, విశేష పూజ కార్యమ్రం నిర్వహించారు. రాత్రి సీతారాముల వారిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొండూరు అశోకరాజు దంపతులు, ఆలయ పురోహితులు వందవాసి మహేష్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank Together we can

తిరుపతి ప్రధాన శాఖ-2, డి.నెం.5-5-303, సిద్ధాంత్ టవర్స్, ఎస్.డి.లేఔట్, తిరుపతి
తిరుపతి ఫోన్: 0877-2220741

**రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు తేది: 02.04.2025

**రుణగ్రహీత:**శ్రీ శ్రీకరం పుల్లయ్య, తండ్రి లేట్ శ్రీ శ్రీకరం శేషయ్య, డి.నెం.2-22/2/2, శ్రీనివాసపురం, తిరుపతి - 517501

**సహరుణగ్రహీత:** శ్రీమతి ఎస్. ధనకొండమ్మ తండ్రి శ్రీ శ్రీకరం పుల్లయ్య, డి.నెం.2-22/2/2, శ్రీనివాసపురం, తిరుపతి - 517501

**సహరుణగ్రహీత:** శ్రీ వెంకట పవన్‌కుమార్ శ్రీకరం తండ్రి శ్రీ శ్రీకరం పుల్లయ్య, డి.నెం.2-22/2/2, శ్రీనివాసపురం, తిరుపతి - 517501

**సహరుణగ్రహీత:** శ్రీమతి మమత శ్రీకరం తండ్రి శ్రీ శ్రీకరం పుల్లయ్య, డి.నెం.2-22/2/2, శ్రీనివాసపురం, తిరుపతి - 517501

గ్యారంటారు: శ్రీ పోలవరపు రాజాచౌదరి తండ్రి పోలవరపు వెంకటేశ్వరరావు, డి.నెం.19-14-22, రాఘవేంద్ర నగర్, ఎస్.జి.యస్.ఆర్ట్స్ కాలేజ్, తిరుపతి - 517501

అయ్యా/ అమ్మా !

**విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు**

మా కెనరాబ్యాంక్, ఎం.ఆర్.పల్లి-2 శాఖ నుండి మీరు శ్రీమతి ముని రాజమ్మ పేతారి & శ్రీ పి.ఉమామహేశ్వర్‌రెడ్డి కాలానుగుణంగా పొందిన లోన్స్/ రుణ సౌకర్యాల వివరములు

| రుణ స్వభావం | రుణం మొత్తం & ఖాతా నెంబరు | తేది: 31.03.2025 నాటికి బకాయిమొత్తం | వడ్డీ రేటు |
|---|---|---|---|
| హౌసింగ్ లోన్ | రూ.1,80,00,000/- 31717740000527 | రూ.1,82,49,651.93 | 11.00% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసు షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో విఫలమైనందున బ్యాంకు సదరు ఋణాన్ని **తేది: 31.03.2025** నిరర్థక ఆస్తిగా (ఎన్‌పిఏగా) వర్గీకరించినది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.1,82,49,651.93పై (ఒక కోటి ఎనభై రెండు లక్షల నలభై తొమ్మిది వేల ఆరు వందల యాభై ఒక్క రూపాయల తొంభై మూడు పైసలు మాత్రమే)**లను + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసును జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కులను మేము వినియోగించుకుంటాము. అంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింప బడుచున్నారు. సదరు చట్టం మరియు / లేదా అమలులో వున్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కులకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించు కోగలరని సూచించడమైనది. మా శాఖ రికార్డులలో అందుబాటులో వున్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగినది.

**షెడ్యూలు: తనఖాలో వున్న ఆస్తి యొక్క వివరములు దిగువ తెలుపడమైనది.**

చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా,తిరుపతి, తిరుపతి రూరల్ సబ్ జిల్లా తిరుపతి రూరల్ మండలం, నెం.49 అవిలాల గ్రామలెక్కదాఖలా, పద్మావతిపురం గ్రామ పంచాయతీ, పాత వార్డునెం.1 మరియు కొత్త వార్డునెం.2, శ్రీనివాసపురం రెసిడెన్షియల్ ఏరియా - సర్వేనెం.330/1లో ఎ.2.87సెంట్లు మరియు సర్వేనెం.331/2 లో ఎ.2.42 సెంట్లు వెరశి మొత్తం ఎ.5.29 సెంట్లు ఇందున 200 చ.గ. ఖాళీ స్థలం మరియు డి.నెం.2-22/2/2 గల ఆర్.సి.సి. డూప్లెక్స్ మోడల్ ఇల్లు ఇందుకు కొలతలు: తూర్పు నుండి పడమర: 36అ. లేదా 10.980మీ. ఉత్తరం నుండి దక్షిణం: 50అ. లేదా 12.250మీ. వెరశి 1800 చ.అ. లేదా 200చ.గ. లేదా 50 అంకణములు హద్దులు: తూర్పు: 20అ. వెడల్పు గల రోడ్డు, పడమర:డి.నెం.2-22/3 గల ఉమాపతి రెడ్డి ఇల్లు, ఉత్తరం: 20 అ. వెడల్పు గల రోడ్డు, దక్షిణం: డి.నెం.2-22-2/1 గల కాంచన ఇల్లు.

స్థలం : తిరుపతి
తేది: : 02.04.2025

సం|| అధీకృత అధికారి,
కెనరా బ్యాంక్

# సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ విజయవంతం



కోట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఈ నెల 7 నుంచి నాలుగురోజుల పాటు నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ ఫండమెంటల్స్ అండ్ ప్రాక్టికల్ అప్లికేషన్స్ వర్క్‌షాప్ విజయ వంతంగా ముగిసింది. చివరిరోజు గురువారం సుప్రజా టెక్నాలజీస్ బృందం నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో వివిధ విభాగాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించేందుకు ఒక ప్రత్యేక హ్యాకథాన్ నిర్వహించారు. ఈ హ్యాకథాన్‌లో ప్రతిభ చూపిన టాప్ 93 మంది విద్యార్థులకు సుప్రజ టెక్నాలజీస్ నుంచి ఇంటర్న్‌షిప్ ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు ఇలాంటి వర్క్‌షాప్‌లో ఎంతో ఉపయోగకరమని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉన్న అవకాశాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, ఎఐడిఎస్ విభాగాధిపతి డాక్టర్ నారాయణరావు, ఇట్రిపుల్‌ఇ ఎస్‌డి కౌన్సిలర్ డాక్టర్ సురేష్‌బాబు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌ఛార్జ్ చంద్రకాంత్, సైబర్ సెక్యూరిటీ క్లబ్‌ఇన్‌ఛార్జ్ శివప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వెంకటగిరి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిపో సెక్రటరీ కె.వి.రత్నం కోరారు. డిపో ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గేట్ మిట్టింగ్ ధర్నా డిపో ప్రెసెడెంట్ వి.పి.రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంను ఉద్దేశించి డిపో సెక్రెటరీ కె.వి.రత్నం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. 1/2019 సర్కులర్‌ను అమలు పరచి ఉద్యోగులకు ఉగ్యోగ భద్రత కల్పిచాలన్నారు. నైట్ ఔట్ అలవెన్స్ 150 రూపాయల నుండి 400 రూపాయలకు పెంచాలని ధర్నా ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో డిపోవర్కింగ్ ప్రెసెడెంట్ ఏ.రాజక్, ఎస్.జి.భాష కృష్ణారెడ్డి, పి.భాస్కర్‌లతో పాటు గ్యారేజ్ సెక్రటరీ, ప్రెసెడెంట్, ఏ ఎం రాజా, శివ కుమార్, కృష్ణ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి పని కల్పించాలి : ఎంపీడీవో



వాకాడు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మండలంలోని ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా జాబ్ కార్డులందరూ అర్హులని, ప్రతి ఒక్కరికి పనిని కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో శ్రీనివాసులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో విజయ,సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు ఫీల్ అసిస్టెంట్లతో మాట్లాడుతూ గ్రామంలోని జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొని, గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని అదే విధంగా ఆయా గ్రామాలలో గోకులం షెడ్స్, క్యాటిల్ పాండ్స్ పనులు పూర్తి చేయాలని సూచించారు. మండలంలోని ఆయా పంచాయతీలలో ఎక్కడ కూడా అవినీతికి తావివ్వకుండా పనిచేయాలని మార్గనిర్దేశం ఫీల్డ్ అసిస్టెంట్లకు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఓ విజయ, ఈసీ మల్లికార్జున, టిఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు



కోట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : కోట తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం తహశీల్దార్ కె.జయజయరావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో కార్యాలయాలకు వివిధ పనులపై ప్రజలు వస్తుంటారని, వారికి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగకర మన్నారు. నీళ్లలో చల్లదనం, మనసుల్లో మంచితనం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్, సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ మధులత, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

## ముగిసిన సాగర్ కవచ్



కోట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : గత రెండు రోజులుగా వాకాడు మండలం దుగరాజపట్నం, కోట మండలం శ్రీనివాససత్రం వరకు పోలీసులు సాగర కవచ్ కింద తీరప్రాంతాల భద్రతపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ అపరిచితులు సముద్ర తీరంలోకి వస్తే పోలీసులకు సమాచారం తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో వాకాడు మెరైన్ ఎస్ఐ సౌమ్య, కోట పోలీసులు పాల్గొన్నారు.

## బిజెపి ప్రధాన కార్యదర్శికి సన్మానం



కోట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మండల బిజెపి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పులి సురేష్ గురువారం నాయుడుపేటలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని, జిల్లా బిజెపి అధ్యక్షుడు శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని పులి సురేష్ శాలు వాలతో సన్మానించారు. ఈ పరిచయ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి!



తడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మండలం అక్కంపేట రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం ఉదయం ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉండగా రైల్వే పోలీసులకు సమాచారం అందింది. సూళ్లూరుపేట- అక్కంపేట రైల్వేస్టేషన్ల మధ్య సుమారు 30-35 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి శవాన్ని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు స్వాధీనం చేసుకున్నారు. రైలు నుంచి పడి చనిపోయినట్లుగా అనుమానిస్తున్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతుడు నీలంరంగు డిజైన్ కలిగిన పొడవు చేతుల చొక్కా, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. శవాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ముఖ్యమంత్రికి ఆహ్వానం



తడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మండలం చేనిగుంటకు చెందిన మాజీ ఎంఎల్‌సీ, బిజెపి నాయకుడు వాకాటి నారాయణరెడ్డి తన కుమార్తె వివాహ పత్రికను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందించి ఆహ్వానించారు. వాకాటి గురువారం తన సతీమణి లక్ష్మీగీతతో కలిసి ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి వివాహ పత్రిక అందజేశారు. ఈ వివాహానికి తప్పకుండా హాజరు కావాలని దంపతులు కోరగా, చంద్రబాబు ఖచ్చితంగా వస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

## దినేష్‌కు యుటిఎఫ్ ఆర్థిక సాయం



తడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మండలం కొండూరు ఎస్సీ కాలనీకి చెందిన బిటెక్ విద్యార్థి మీంజూరు దినేష్ కొన్ని నెలలుగా గుండె మరియు ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. చెన్నైలోని ప్రముఖ ఆసుపత్రులకు తీసుకెళ్లినా గుండె రీప్లేస్‌మెంట్ చేయాల్సిన పరిస్థితి ఉందని డాక్టర్లు చెప్పడంతో ఆ విద్యార్థి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఈ సమస్యను తెలుసుకున్న కొన్ని స్వచ్ఛంద సంస్థలు అతనికి ఆర్థిక సాయం అందజేయాలని ముందుకొస్తున్నాయి. అదే గ్రామానికి చెందిన తడ సిఆర్‌ఎంటి గోపి యుటిఎఫ్ నాయకులను కోరడంతో ఆ ఉపాధ్యాయ సంస్థ ప్రాంతీయ మండలాల ద్వారా సాయం కోరి రూ.55 వేలు సమీకరించి దినేష్‌కి అందజేసినట్లు గురువారం తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సునీల, తిరుపతి జిల్లా కార్యదర్శి ప్రభాకర్ చేతుల మీదుగా మండల యుటిఎఫ్ నాయకులు వెళ్లి దినేష్‌కి సాయం అందజేసి ధైర్యం చెప్పి వచ్చారు.

# ఆధ్మాతికతకు నిలయం శ్రీ శుకబ్రహ్మాశ్రమం

**-నేటి నుంచి 21వ ఆరాధన మహోత్సవాలు**



ధ్యాన మందిరం దృశ్యం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సువర్ణముఖి తీరాన వెలసిన శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో శుక్రవారం నుంచి 21వ ఆరాధన మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు ఏర్పాట్లును ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపా నందగిరి స్వామి పర్యవేక్షిస్తున్నారు. ఐదు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్ని భక్తులు విరివిగా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే వారికి అలాగే ఆశ్రమ పీఠాధితపతులకు అన్ని సదుపాయాలు కల్పించడం జరిగింది.

**ఇదో ఆధ్మాత్మిక నిలయం:**

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తి పట్టణానికి శ్రీకాళహస్తీశ్వరా లయానికి దక్షిణాన పవిత్ర సువర్ణముఖి నదీతీరాన ప్రశాంత వాతావరణంలో వెలసిన దివ్యధామం శుకబ్రహ్మాశ్రమం. ఇక్కడ 1950లో ఏర్పేడు మలయాళ సద్గురు శిష్యులు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి ఆశ్రమాన్ని స్థాపించారు.

సుమారు 50 ఎకరాల స్థలంలో నిర్మించిన ఆశ్రమం ఎంతో ప్రశాంత వాతావరణంలో సాగుతుంది. ఓ వైపు ధార్మిక కార్యక్రమాలు మరో వైపు సామాజిక కార్యక్రమాలతో పాటు 'గీతా మకరందాన్ని' ప్రపంచ నలుమూలల్లో అన్ని భాషల్లో అందించిన ఘనత సద్గురు విద్యాప్రకాశానందగిరి స్వామిదే అని చెప్పవచ్చు. ఆయన ప్రసంగాలంటే భక్తులకు ఎనలేని ఆశక్తి. ఆయన విద్యావంతుడైనా పండిత పామరులకు అర్థమయ్యేరీతిలో సులభశైలిలో వాడక భాషలో తాను చెప్పదల్చుకున్నది స్పష్టంగా క్లుప్తంగా అందించేవారు. 1948 వరకు మళయాళ స్వామి ఆశ్రమం వ్యాసాశ్రమంలో సాధువుగా మళయాళ సద్గురు శిష్యుడుగా కొనసాగిన ఆయన తరువాత గురోపదేశంతో పవిత్ర సువర్ణముఖి తీరాన ఆశ్రమాన్ని స్థాపించారు. ఆయన 'మానవ సేవే మాధవ సేవ అనే'నినాదంతో తమ ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్ని చేపట్టారు. ఆశ్రమాలే సన్మార్గానికి మార్గదర్శకాలని ఆయన సమాజానికి చాటిచెప్పారు.

**ప్రశాంత వాతావరణంలో ఆశ్రమం:**

పట్టణానికి సుమారు కిలో మీటర్ దూరంలో వెలసిన శుకబ్రహ్మాశ్రమంలో గురుకులాలు, సంస్కృత పాఠశాలల్ని ఏర్పాటు చేశారు. అలాగే మానవునికి అన్ని అంగాల కన్నా కన్ను మిన్న అని భావించిన ఆయన భక్త కన్నప్ప కంటి ఆసుపత్రిని 1994లో ప్రారంభించారు.అప్పటి నుంచి సుమారు లక్షాలాది మంది నిరుపేదలకు ఆయన చూపును ప్రసాదించిన ఘనత దక్కింది. ఏ వైద్యసదుపాయం లేని రోజుల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు వైద్యసేవలను అందించటానికి ఓ చిన్న ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. అలాగే మానవుడు సన్మార్గంలో నడచుకొనుటకు 'విద్య' అవసరమని భావించిన ఆశ్రమ వ్యవస్థాపకులు విద్యాప్రకాశానందగిరి స్వామి శ్రీకాళహస్తిలో ఉన్నత విద్యకు ఎంతో సేవ చేశారు.

## స్పార్క్ ఆఫ్ ద ఇయర్‌గా రమ్య




తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : స్థానిక ఎల్ఐసి రోడ్డులో ఉన్న ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థినీ విద్యార్థులకు స్పార్క్25 పేరిట స్పీచ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ పోటీలలో 150 మంది విద్యార్థిని విద్యార్థులకు వీడియో ప్రెజెంటేషన్, ఎక్స్టెంపోర్,గ్రూప్ డిష్కషన్ తదితర విభాగాలలో విద్యార్థులు తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శిం చగా 12 మంది విద్యార్థులు ఫైనల్స్ కు అర్హత సాధించారు. ఫైనల్ పోటీలలో ప్రతి విద్యార్థి నేటి ప్రపంచ పరిస్థితులకు సంబంధించి పవర్ ఆఫ్ స్మాల్ హాబిట్స్,ఆర్ ఆఫ్ లిజనింగ్,ఇంపార్టెన్స్ ఆఫ్ లోకల్ లాంగ్వేజెస్, ఇంపార్టెన్స్ ఆఫ్ మ్యూజిక్ ఇన్ లైఫ్ తదితర అంశాలపై తమ సందేశాన్ని తెలియజేశారు. ఈ పోటీలలో ద్వితీయ సంవత్సరం బీఎస్సీ విద్యార్థిని రమ్య ప్రథమ స్థానం సాధించి రూ.5000/ నగదు బహుమతి,ఉత్తమ ప్రశంసా పత్రం,షీల్డ్, తృతీయ సంవత్సరం బీకాం విద్యార్థిని మోహిత ద్వితీయ బహుమతి సాధించి రూ. 3000/ నగదు బహుమతి,ఉత్తమ ప్రశంసా పత్రం,షీల్డ్, ద్వితీయ సంవత్సరం బి.బి.ఎ.విద్యార్థిని సాయికీర్తణ తృతీయ స్థానం సాధించి రూ.1,000/ నగదు బహుమతి, ఉత్తమ ప్రశంసాపత్రం,షీల్డను అందుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎమరాల్డ్స్ కళాశాల సంచాలకులు గిరిధర్,విశ్వనాథ్ పాల్గొని,విజేతలను, పోటీలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థుల అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు మునిరత్నం,ప్రిన్సిపాల్ జాఫర్ వల్లీ, అధ్యాపకులు భానుకిరణ్,గ్రేస్ వినీల వసుందర,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేవస్థానంలో ఈఓ విస్తృత తనిఖీలు



కాణిపాకం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఈఓ పెంచల కిషోర్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు దేవస్థానం పరిసరాల్లోని వ్యక్తిగత మరుగుదొడ్లు, కళ్యాణకట్ట, బస్టాండ్ తదితర ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వ్యక్తిగత మరుగుదొడ్లును ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ప్రత్యేక దృష్టి సారించాలని శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. అలాగే కళ్యాణకట్టలో క్షురకులు భక్తులు గుండు గీసేటపుడు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అలాగే బస్టాండ్ తదితర ప్రాంతాలను చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా వుంచాలని సిబ్బందిని ఈఓ పెంచల కిషోర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## గణపతి హోమం పులివర్తి నాని ప్రత్యేక పూజలు



చంద్రగిరి, ఏప్రిల్ 10 ప్రభాత వార్త: తన కార్యకర్త నాగభూషణం గృహ ప్రవేశ కార్యక్రమంలో నిర్వహిస్తున్న గణపతి హోమం లో పాల్గొన్న ఎంఎల్ఏ పులివర్తి నాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని దోర్నకంబాలకు చెందిన టిడిపి కార్యకర్త తన నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎంఎల్ ఏని ఆహ్వానించగా గురువారం ఆయన ఇక్కడికి చేరుకుని కార్యకర్త కుటుంబాన్ని ఆశీర్వదించారు. ఈ క్రమంలో దోర్నకంబాల హెల్త్ క్లినిక్‌కు విద్యుత్ మీటర్ లేదని ఎంఎల్‌హెచ్‌పి సి.అపర్ణ, ఏఎన్ఎం డి.మంజుల ఎంఎల్ఏ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆయన విద్యుత్ శాఖ అధికారులకు సిఫార్స్ చేసి మీటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు పెరుమాళ్ పల్లి ఈశ్వర్ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, నాయకులు వీరంగారి రమేష్‌రెడ్డి, కన్నయ్య నాయుడు, చెర్లోపల్లి శ్రీధర్ నాయుడు, మహేష్ రాయల్, మునిరత్నం రాయల్, లోకేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## స్నపనంతో మలయప్ప ఉత్సవర్లు చల్లచల్లగా...!

**-ఆగమోక్తంగా ఆరంభమైన వసంతోత్సవాలు**



తిరుమల,ఏప్రిల్ 10 ప్రభాతవార్తప్రతినిధి: వసంతరుతువులో వేసవితాపం నుండి ఉపశమనం కోసం శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు వసంతోత్సవాలు ఆరంభమయ్యాయి. తొలిరోజు గురువారం ఉదయం శ్రీదేవి భూదేవి మలయప్పస్వామిని మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి పడమరవైపు ఉన్న వసంతమండపానికి ఊరేగింపుగా తీసుకెళ్ళారు. అక్కడ మలయప్ప ఉభయ దేవరులకు స్నపనతిరుమంజనం శోభాయమానంగా నిర్వహించారు. ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమజాతి పుష్పమాలలను స్వామి,అమ్మవార్లకు అలంకరింపజేశారు. సాయంత్రం ఆలయానికి చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## రోడ్డు ప్రమాదం...వ్యక్తి దుర్మరణం

తడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మండలం కారూరుమిట్ట వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడులోని రెడ్‌హిల్స్ ప్రాంతానికి చెందిన సుబ్రమణి (50) అనే వ్యక్తి మృతిచెందాడు. సుబ్రమణి కుమారుడు విజయ్ ఫిర్యాదు మేరకు సుమారు నెలరోజులుగా కొంతమందితో కలిసి ఇక్కడ రైల్వే కూలీ పనులు చేసేందుకు సుబ్రమణి ఆంధ్రాకు వచ్చి ఉన్నాడు. కాసింగాడు కుప్పంలో నివాసం ఉంటూ బుధవారం రాత్రి వంట సరుకుల కోసం వచ్చి అవి తీసుకుని తిరిగి వెళుతుండగా జాతీయ రహదారిపై వెళుతున్న టెంపో వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న వాహనం ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన సుబ్రమణి కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకునే లోపే మృతిచెందాడు. ఈ మేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి ఎస్ఐ కొండప్పనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గర్భవతులు పౌష్టిక ఆహారం తీసుకోవాలి : సిడిపిఓ



వెంకటగిరి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : గర్భవతులు పౌష్టిక ఆహారం తీసుకొని తల్లి బిడ్డఆరోగ్యంగా ఉండాలని సిడిపిఓ షంషాద్ బేగం తెలిపారు. గొల్లపాలెంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. గర్భం దాల్చినప్పటి నుండి డెలివరీ అయిన రెండు సంవత్సరాలు వరకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గర్భవతి అయిన వెంటనే అంగన్వాడి కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. టాటా ట్రస్ట్ నిర్వాహకులు లక్ష్మి, సూపర్వైజర్ కల్పలతా తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలి



వెంకటగిరి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: 14వ వార్డు టెలిఫోన్ ఎక్స్చేంజి నుండి బొగ్గులు పెట్ట సబ్స్టేషన్ వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి దీపాలు వేయాలని చైర్పర్సన్ నక్క భానుప్రియకు కౌన్సిలర్ ఆరిశంకరయ్య వినతిపత్రం అందజేశారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ఎస్టిమేషన్స్ కూడా వేసి ఉన్నారని తెలిపారు. విద్యుత్‌శాఖ వారికి నాలుగు లక్షల 76 వేల రూపాయలు చెల్లించాలని ఆయన కోరారు. విద్యుత్ స్తంభాలు దీపాలు ఏర్పాటు చేసి ప్రజల సమస్య పరిష్కరించాలని తెలిపారు.

## రాంకుమార్‌రెడ్డిని అభినందించిన జగన్మోహన్ రెడ్డి



వెంకటగిరి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మున్సిపల్ చైర్ పర్సన్ నక్క భానుప్రియ పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయే విధంగా చేసిన వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అభినందించారు. తాడేపల్లిలోని జగన్మోహన్‌రెడ్డి నివాస గృహంలో రామ్ కుమార్ రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అవిశ్వాస తీర్మానంపై వివరించారు. అధికార పార్టీ వారు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ వైసిపి కౌన్సిలర్లు భయపడకుండా అవిశ్వాస తీర్మానం వీగిపోయే విధంగా చేసినట్లు వివరించారు. ఎమ్మెల్యే కురుమల రామకృష్ణ ఈ నెల 9వ తేదీ జరిగే అవిశ్వాస తీర్మానాన్ని వాయిదా వేయించాలని చేసిన ప్రయత్నాలపై, వైసిపి కౌన్సిలర్లు అందరూ ఏకతాటిపై నిలిచి వీగిపోయే విధంగా చేశారని మాజీ సీఎంకు వివరించారు.

## సిఎం రిలీఫ్ ఫండ్‌ను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



గూడూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు అప్పులు చేసి వైద్యం చేయించుకున్న వారు వైద్య బిల్లులతో సంప్రదిస్తే వారికి సీఎం సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో చిట్టమూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన గుండె జబ్బుతో బాధపడుతున్న రామ్మూర్తి అనే రోగికి సీఎం సహాయనిధి నుండి ఎల్ఓసి నాలుగు లక్షల 50 వేల రూపాయలు మంజూరు పత్రాలను వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరథ రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహావీర్ జయంతి వేడుకలు



గూడూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మహావీర్ జయంతి సందర్భంగా గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో ఉన్న జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం రాజా వీధిలో జైన్ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ధర్మీచంద్ మాట్లాడుతూ భగవాన్ మహావీర్ జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## నేడు చలో కలెక్టరేట్ కరపత్రాలు ఆవిష్కరణ



గూడూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : పట్టణంలోని పాత బస్టాండ్‌లోని ఆర్ అండ్ బి ఆఫీసు కార్యాలయం బయట మహాత్మ జ్యోతిబా పూలే సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద కరపత్రాలు గురువారం ఆవిష్కరించారు. శుక్రవారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రతి మండల పరిధిలో మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి సందర్భంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రతి జిల్లా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమానికి బీసీలందరూ పాల్గొనాలన్నారు. ఆంధ్రప్రదేశ్లో కులగణన చేపట్టాలని మహాత్మ జ్యోతిరావు జయంతి సందర్భంగా ఏప్రిల్ 11వ తేదీన జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బీసీల సమరభేరి పేరుతో నిరసన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాశిన భాస్కర్ గౌడ్, బిఎస్‌పి నాయకులు బీసీ సమన్వయ కమిటీ, నియోజకవర్గ కన్వీనర్ ఎల్వి సుబ్బయ్య, బీఎస్పీ నాయకులు గుంట మడుగు వెంకటేశ్వరరాజు, ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నాయకులు విజయ్ కుమార్ బీసీ సమన్వయ కమిటీకో కన్వీనర్ తిరగా బత్తిన శేషయ్య గౌడు, ఎమ్మార్పీఎస్ నాయకులు మందా రవి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ కోదండ రామస్వామి పూలంగి సేవ



చిల్లకూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: మండలం తమ్మినపట్నం గ్రామంలో వెలిసిన శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానములో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు సందర్భముగా చివరి రోజు అయిన 7వ రోజు ఉదయం శ్రీ స్వామి వారికి పూలంగి సేవ కార్యక్రమం జరిగింది. సాయంత్రం డోలోత్సవం, ఏకంతసేవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కోట సతీష్ యాదవ్, కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గోనారు.

## అసభ్యకర పోస్టులపై పోలీసులకు ఫిర్యాదు

నాయుడుపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త; మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అవమానపరిచే విధంగా కొంత మంది సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్నారని మాజీ జిల్లా సహకార బ్యాంక్ చేర్మేన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గురువారం పెళ్ళకూరు పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రిని అవమానించాలన్న ఉద్దేశంతో కొంతమంది అధికారపార్టీకి చెందిన వారు సోషల్ మీడియాల్లో అసభ్యకర పోస్టులు పెడుతున్నారని తెలిపారు. ఇప్పటికైన పోలీసులు స్పందించి అసభ్యకరపోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆర్టీసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



తొట్టంబేడు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : ఆర్టీసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని నేషనల్ మజ్దూర్ యూనియర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు జెడి శేఖర్ డిమాండ్‌చేశారు. ఆర్టీసి ఉద్యోగుల పట్ల ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా గురువారం స్థానిక ఆర్టీసి డిపో గ్యారేజీలో ఎన్ఎంయు నేతలు నిరసన తెలిపారు. సర్కులర్ 1/19ను యధావిధిగా అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నాలుగు సంవత్సరాలుగా నిలచిపోయిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలని శ్రీకాళహస్తి డిపో పరిధిలో కండక్టర్, డ్రైవర్ల కోసం విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రీజినల్ నాయకులు వైడి కుమార్, జోనల్ నాయకులు ఎల్వీకెరావు, మురళీ, శివకుమార్, ఎంఎస్‌సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.